


తెలుగు జాతీయ దినపత్రిక
# అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




సంపుటి :04 సంచిక : 345 ఆంధ్ర ప్రదేశ్ సంపాదకులు బి .అనిల్ కుమార్ గురువారం జులై 10 2025



## ఢిల్లీకి చేరిన కుర్చీ పంచాయతీ..

### కర్ణాటకలో అసలేం జరుగుతోంది?

-సీఎం సిద్ధూ, డిప్యూటీ సీఎం డీకే హస్తిన పర్యటన
-బెంగళూరులో ఎమ్మెల్యేలతో చర్చిస్తున్న పార్టీ ఇన్‌చార్జ్ సుర్జేవాలా
-నాయకత్వ మార్పుపై పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ
-కర్ణాటక సీఎం మార్పుపై మరోసారి ఊహాగానాలు

2



# మంత్రులకు చంద్రబాబు వార్నింగ్

-మంత్రుల పనితీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి
-విపక్షాల తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని ఆదేశం
-పనితీరు బాగోకపోతే కొత్తవారికి అవకాశం ఇస్తానని స్పష్టీకరణ

పనితీరు మెరుగుపరుచుకోకపోతే పదవులు ఉండవంటూ తన కేబినెట్ సహచరులకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టడంలో విఫలమైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆయన మంత్రుల పనితీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రస్తుత రాజకీయాలు కేవలం సబ్జెక్టు ఆధారంగా కాకుండా, ప్రచారాలపైనే ఎక్కువగా నడుస్తున్నాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో మంత్రులు అన్ని విషయాలపై సకాలంలో స్పందించాలని గట్టిగా సూచించారు. "విపక్షాల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడే తిప్పికొట్టకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. మీరు సరిగా స్పందించకపోతే మీ స్థానంలో కొత్తవాళ్లు వస్తారు. ఇక మంత్రులు రోజులు లెక్కపెట్టుకోవాల్సి వస్తుంది" అని ఆయన హెచ్చరించారు.వైసీపీ నాయకులు మహిళల పట్ల కూడా అసభ్యంగా మాట్లాడుతున్నారని, వారి నిజ స్వరూపాన్ని ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత మంత్రులపై ఉందని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వానికి నష్టం కలిగించే ఏ చిన్న విషయాన్ని కూడా ఉపేక్షించవద్దని, ప్రజాక్షేత్రంలో వాస్తవాలను బలంగా వినిపించాలని ఆయన ఆదేశించారు.

## రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి కేంద్రమంత్రి గ్రీన్ సిగ్నల్..



2

## నా పాలనకు నోబెల్ బహుమతి ఇవ్వాలి

ఢిల్లీలో ముఖ్యమంత్రిగా తాను అందించిన పాలనకు గాను తనకు నోబెల్ బహుమతి ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా తాను ఎంతో అభివృద్ధి చేశానని ఆయన స్పష్టం చేశారు. పంజాబ్‌లోని మొహాలీలో బుధవారం జరిగిన ఒక బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు."ఢిల్లీలో మా ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం మమ్మల్ని సరిగ్గా పనిచేయనీయకుండా అడ్డుకున్నారు.

2



## చైనాతో కాదు, టిబెట్‌తోనే మాకు సరిహద్దు:

-అరుణాచల్ సీఎం పెమా ఖండు కీలక వ్యాఖ్యలు
-అరుణాచల్‌కు చైనాతో సరిహద్దు లేదన్న సీఎం పెమా ఖండు
-తమ సరిహద్దు టిబెట్‌తోనేనని వ్యాఖ్య

అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండు, చైనాకు గట్టి షాకిచ్చేలా కీలక వ్యాఖ్యలు చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చైనాతో అసలు సరిహద్దే లేదని, తమ రాష్ట్రానికి టిబెట్‌తో మాత్రమే సరిహద్దు ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదంపై కొత్త చర్చకు దారితీశాయి.

2



## రాజకీయ పార్టీలలో విభేదాలు, గొడవలు సహజమే:

### -మంత్రి వివేక్

-ప్రేమ్ సాగర్ రావుతో విభేదాలపై వివేక్ స్పందన
-జిల్లాకు ఎమ్మెల్యేనే రాజు అని వ్యాఖ్య
-అందరినీ కలుపుకుని ముందుకెళ్తామన్న వివేక్



2

## నా పర్యటనను డైవర్ట్ చేయడానికే ప్రసన్నపై దాడి: జగన్ ఫైర్

-పసన్నకుమార్ రెడ్డి ఇంటిపై దాడి పథకం ప్రకారమే జరిగిందన్న జగన్
-ప్రసన్నను అంతం చేయాలనే లక్ష్యంతోనే దాడి చేశారని ఆరోపణ
-రెడ్ బుక్ రాజ్యాంగంతో పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపాటు

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏపీలోని కూటమి ప్రభుత్వంపై మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నెల్లూరు జిల్లా కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని ఖండిస్తూ, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రోద్బలంతో జరిగిన హత్యాప్రయత్నమేనని సోషల్ మీడియా వేదికగా సంచలన ఆరోపణలు చేశారు.పోలీసుల సమక్షంలోనే టీడీపీకి చెందిన రౌడీలు ఈ దాడికి పాల్పడ్డారని జగన్ ఆరోపించారు.



2

## ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటు..

### - పురందేశ్వరి ఫైర్

-ఆ వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని విమర్శ
-మహిళలను అవమానించడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిందని మండిపాటు
- ప్రసన్నకుమార్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్



2



2

## ఈ నెల 17న ఒక్క రైలును కూడా కదలనివ్వం: కవిత

-42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించాలన్న కవిత -ఎన్డీయేలో బీసీ వ్యతిరేకత పాతుకుపోయిందని విమర్శ
-స్థానిక ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ చేయదని స్పష్టీకరణ

# ఢిల్లీకి చేరిన కుర్చీ పంచాయతీ..

కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవి మార్పుపై జరుగుతున్న ప్రచారం ఇప్పుడు ఢిల్లీకి చేరింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇద్దరూ ఒకేసారి హస్తినలో పర్యటిస్తుండటంతో రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు ఊపందుకున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు నాయకత్వ మార్పును కోరుతున్నారనే వార్తల నేపథ్యంలో, ఇద్దరు కీలక నేతలు కాంగ్రెస్ అధిష్టానంతో సమావేశం కానున్నారనే ప్రచారం ఈ ఊహాగానాలకు ఊతమిస్తోంది.అయితే, ఈ పర్యటన పూర్తిగా రాష్ట్ర అభివృద్ధి పనులకు సంబంధించిందేనని అటు సిద్ధరామయ్య, ఇటు డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన డీకే శివకుమార్, తాను రాష్ట్ర నీటిపారుదల ప్రాజెక్టులకు నిధుల గురించి చర్చించేందుకు వచ్చానని తెలిపారు. మంత్రివర్గంలో ఎలాంటి మార్పులు ఉండబోవని ఆయన తేల్చిచెప్పారు. "సీఎం సిద్ధరామయ్య రక్షణ మంత్రితో సమావేశం కోసం వచ్చారు. మా పర్యటనలన్నీ అభివృద్ధి కోసమే" అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోరానని, ఆయన పాట్నా పర్యటన నుంచి తిరిగి రాగానే కలుస్తానని డీకే వివరించారు.మరోవైపు, పార్టీ కర్ణాటక ఇన్‌చార్జ్ రణ్‌దీప్ సుర్జేవాలా బెంగళూరులో ఎమ్మెల్యేలతో సమావేశమవుతున్నారు. దీనిపై డీకే స్పందిస్తూ, జిల్లా స్థాయిలో పార్టీని పునర్వ్యవస్థీకరించాలని అధిష్టానం కోరుతోందని, దానిపైనే సుర్జేవాలా కసరత్తు చేస్తున్నారని చెప్పారు. 2023లో కాంగ్రెస్ ఘన విజయం సాధించినప్పటి నుంచి సీఎం పదవిపై చర్చ కొనసాగుతూనే ఉంది. అప్పట్లో కుదిరిందని చెబుతున్న ఒప్పందం ప్రకారమే మార్పు జరగనుందనే వాదనలు వినిపిస్తున్నా, కాంగ్రెస్ దీనిపై అధికారికంగా స్పందించలేదు. నేతలు అభివృద్ధి పనులని చెబుతున్నప్పటికీ, ఒకేసారి ఇద్దరూ ఢిల్లీలో ఉండటం కర్ణాటక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి కేంద్రమంత్రి గ్రీన్ సిగ్నల్..

తెలంగాణకు అవసరమైన యూరియా కోటాను పెంచాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. రాష్ట్ర రైతాంగానికి ఎరువుల కొరత రాకుండా చూస్తామని హామీ ఇచ్చింది. అయితే, అదే సమయంలో రాష్ట్రంలో యూరియా వాడకం పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది.ఇటీవల ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో భేటీ అయి రాష్ట్రానికి యూరియా కోటాను పెంచాలని కోరారు. ఈ విజ్ఞప్తిపై స్పందించిన కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా యూరియాను వెంటనే సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. సరఫరా అయిన యూరియాను వ్యవసాయేతర పనులకు మళ్లించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, అన్ని జిల్లాలకు సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు.అదే సమయంలో, తెలంగాణలో యూరియా వాడకం పెరగడంపై మంత్రి నడ్డా ఆందోళన వ్యక్తం చేశారు. 2024-25 యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో యూరియా అమ్మకాలు ఏకంగా 21 శాతం పెరిగాయని ఆయన గుర్తు చేశారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. 'ప్రణామ్' పథకం కింద రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని ఆయన వివరించారు.

# రాజకీయ పార్టీలలో విభేదాలు, గొడవలు సహజమే

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుతో తనకు విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ప్రచారానికి రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తెరదించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయంపై స్పష్టత ఇచ్చారు. "జిల్లాకు ఎమ్మెల్యేనే రాజు. ఆ రాజుకు మంత్రులుగా మా సహాయం అవసరమైతే తప్పకుండా చేసి పెడతాం" అని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలలో గ్రూపులు, గొడవలు చాలా సాధారణమని, రాష్ట్రంలోని ప్రతి పార్టీలోనూ ఇలాంటివి ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో, "బీఆర్ఎస్‌లో కేటీఆర్, కవిత మధ్య గొడవలు లేవా?" అని ఆయన ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీలో పాత, కొత్త నేతలందరినీ కలుపుకొని ముందుకు వెళ్తామని వివేక్ తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను మీనాక్షి నటరాజన్ గుర్తిస్తున్నారని, అందరికీ తగిన అవకాశాలు వస్తాయని భరోసా ఇచ్చారు.ఇదే సందర్భంగా ఆయన గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మంత్రులను కలవడానికి కూడా ప్రజలకు అవకాశం ఉండేది కాదని ఆరోపించారు. తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలా కాదని, పాశమైలారం ఘటన జరిగిన వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించి ధైర్యం నింపారని గుర్తుచేశారు. గతంలో కొండగట్టులో అంత పెద్ద ప్రమాదం జరిగినా కేసీఆర్ కనీసం అటువైపు వెళ్లలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా మంత్రులను కలుస్తున్నారని అన్నారు. కార్మికులు, గిగ్ వర్కర్ల హక్కుల కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి కనీస వేతనం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివేక్ హామీ ఇచ్చారు.

# దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కార్మికులు ర్యాలీ మానవ హారం..




. రేపల్లె .. ~ 9 7.. 25

కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్ రద్దుచేయాలని,కనీస వేతనం 26000 ఇవ్వాలని సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీ,ఆశ,ఆటో కార్మికులు...దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కార్మికులు సమ్మెర్యాలీ, మానవహారం..దేశవ్యాప్తంగా కార్మిక సమస్యల మీద జరుగుతున్న సమ్మెలో భాగంగా నిజాంపట్నం మండల కేంద్రంలో తాహసిల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి,వినతిపత్రం అందించిన అంతరం ప్రదర్శనగా బస్టాండ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలపటం జరిగింది...ఈ సందర్భంగా సమ్మెలో సంఘీభావంగా పాల్గొన్న ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా నాయకులు ఎన్.శివశంకర్,నిజాంపట్నం మండలం సిఐటియు కన్వీనర్ చెన్ను. ప్రహ్లాదుడు,అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఉష మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికులను బానిసలుగా చేసే విధంగా కేంద్రప్రభుత్వం లేబర్ కోడ్స్ తీసుకువచ్చింది,ఈ లేబర్ కోడ్స్ అమలు అయితే సంఘం పెట్టుకోవటానికి, సమ్మె చేయటానికి,కనీస వేతనాలు,పెన్షన్ ప్రావిడెంట్ ఫండ్ అడగటానికి కార్మికులకు ఇప్పటివరకు ఉన్న హక్కులు కోల్పోతారు.కావున ప్రమాదపరితమైన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దుచేయాలి,కార్మికులందరికీ కనీస వేతనం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 26వేలు ఇవ్వాలి,ధరల పెరుగుదలకు పరిహారంతో పాటు 5సంవత్సరాలకోసారి కనీసవేతనాల సవరణచేయాలి.రాష్ట్రంలో ఎన్నికల ముందు హామీల్లో భాగంగా అంగన్వాడీలు,ఆశా వర్కర్ల వేతనాలు పెంపుదల చేయాలి,సంక్షేమ పథకాలన్నీ అమలుచేయాలి,రవాణా రంగంలో పెద్ద సంఖ్యలో ఉన్న ఆటో కార్మికుల కోసం సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి,లక్షల రూపాయలు పెట్టుబడితో ఆటోలు తెస్తున్నప్పటికీ ప్రభుత్వ విధానాల వల్ల ఉపాధి కోల్పోవలసి వస్తుందని,ఆటో కార్మికులకు ప్రభుత్వం 25 వేల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు ఆశ,అంగన్వాడి,ఆటో వర్కర్స్ నాయకులు పీతా.సురేష్,శకుంతల వరలక్ష్మి,గాయత్రి,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

# మండలంలో సుపరిపాలనలో తొలి అడుగు

గుడ్లూరు,

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు. కందుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశానుసారం మండల కేంద్రమైన గుడ్లూరులోని ఎస్సీ కాలనీ, మిట్టపాలెం, గుడ్లూరు మండలంలోని గుండ్లపాలెం, నాయుడుపాలెం గ్రామపంచాయతీలలో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. గుడ్లూరులో జరిగిన కార్యక్రమంలో మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు జొన్నలగడ్డ రమణమ్మ,టిడిపి నాయకులు ఉన్నం వెంకటేశ్వర్లు, దామా వెంకటేశ్వర్లు, రావూరి వేణుగోపాల్, జాజులు శ్రీనివాసులు ,మలిశెట్టి కోటేశ్వరరావు, జానకి రామయ్య పాల్గొన్నారు. నాయుడుపాలెం, గుండ్లపాలెం గ్రామాలలో జరిగిన కార్యక్రమం నందు గుడ్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, గ్రామపార్టీ అధ్యక్షులు, జొన్నలగడ్డ రమేష్ బాబు క్లస్టర్ ఇంచార్జిలు, ఉమ్మినేని సుబ్బారావు, చిత్తారి మల్లికార్జున, గ్రామ నాయకులు బబ్బూరి నాగేశ్వరరావు, చౌటూరి చెంచయ్య, రమేష్, పిగిలి వెంకట నరసింహం, పద్మ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మేకల మాల్యాద్రి, వీరం రాజు, మల్లికార్జున, నాయుడుపాలెం,గుండ్లపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నా పాలనకు నోబెల్ బహుమతి ఇవ్వాలి

అయినా ఎంతో పనిచేశాం. నేను చేసిన పనులకు, నా పాలనకు గాను నాకు నోబెల్ బహుమతి ఇవ్వాలని నేను భావిస్తున్నాను" అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. బీజేపీ పాలనలో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా తమ మొహల్లా క్లినిక్‌లను బుల్డోజర్లతో కూల్చివేశారని ఆయన ఆరోపించారు. "మేం ఎన్నో కష్టాల మధ్య మొహల్లా క్లినిక్‌లు కడితే, వాళ్లు ఐదు క్లినిక్‌లను కూల్చివేశారు. దీనివల్ల వాళ్లకు ఏం లభించింది?" అని ఆయన ప్రశ్నించారు.గత నాలుగు నెలలుగా ఢిల్లీలో తమ పాలనాధికారాలు తగ్గిన తర్వాత, బీజేపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితి దారుణంగా తయారైందని కేజ్రీవాల్ విమర్శించారు. "ప్రస్తుతం ఢిల్లీ ప్రజలకు ఆప్ విలువ తెలుస్తోంది. బీజేపీ పాలనలో మొహల్లా క్లినిక్‌లు మూతపడుతున్నాయి. ఆసుపత్రుల్లో ఉచిత మందులు, పరీక్షల సౌకర్యం ఆగిపోయింది. నగరం అంతా చెత్తతో నిండిపోయింది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తమ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 20 వేల లీటర్ల ఉచిత నీటిని అందించిందని గుర్తుచేశారు. విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. దేశంలో రాజకీయ చర్చల స్వరూపాన్నే తాము మార్చేశామని, ఒకప్పుడు ప్రైవేటీకరణ గురించే మాట్లాడిన వారు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల గురించి చర్చిస్తున్నారని ఆయన వివరించారు.

# నా పర్యటనను డైవర్ట్ చేయడానికే ప్రసన్నపై దాడి:

ఆరుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రసన్నకుమార్‌రెడ్డిని అంతం చేయాలనే లక్ష్యంతోనే ఈ దాడి జరిగిందన్నారు. వయసు పైబడిన ఆయన తల్లిని సైతం భయపెడుతూ టీడీపీ గూండాలు బీభత్సం సృష్టించారని, ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన భయంకర దాడి అని జగన్ పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక నేతను లక్ష్యంగా చేసుకుని ఇంత దారుణంగా దాడి చేయడం ఎప్పుడూ చూడలేదన్నారు.చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు తాను చేపట్టిన పర్యటన నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ దాడికి కుట్ర పన్నారని జగన్ ఆరోపించారు. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా, ఈ దాడి గురించే రాష్ట్రమంతా మాట్లాడుకోవాలనేది వారి పథకమని విమర్శించారు. చంద్రబాబు తన 'రెడ్ బుక్' రాజ్యాంగంతో ఇలాంటి దాడులు చేయిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని జగన్ మండిపడ్డారు. హింస ద్వారా, కక్ష సాధింపు రాజకీయాల ద్వారా ప్రతిపక్షం గొంతు నొక్కలేరని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

# చైనాతో కాదు, టిబెట్‌తోనే మాకు సరిహద్దు:

ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పెమా ఖండు ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంటర్వ్యూలో భాగంగా, అరుణాచల్ ప్రదేశ్ చైనాతో 1200 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటుందని విలేకరి ప్రస్తావించగా, సీఎం ఖండు వెంటనే కలగజేసుకున్నారు. "ఈ విషయంలో నేను మిమ్మల్ని సరిదిద్దాలి. మాకు చైనాతో కాదు, టిబెట్‌తో సరిహద్దు ఉంది" అని ఆయన వివరించారు. భారతదేశంలోని ఏ రాష్ట్రానికీ చైనాతో సరిహద్దు లేదని ఆయన అన్నారు.చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ, 1950లో చైనా టిబెట్‌ను బలవంతంగా ఆక్రమించుకుందని పెమా ఖండు గుర్తుచేశారు. "అధికారికంగా టిబెట్ ఇప్పుడు చైనా ఆధీనంలో ఉందని మాకు తెలుసు. కానీ వాస్తవానికి మా సరిహద్దు ఎప్పుడూ టిబెట్‌తోనే ఉండేది. అరుణాచల్ ప్రదేశ్ భూటాన్, మయన్మార్‌లతో పాటు టిబెట్‌తో అంతర్జాతీయ సరిహద్దులను పంచుకుంటోంది" అని ఆయన తెలిపారు.అరుణాచల్ ప్రదేశ్‌ను తమ భూభాగంలోని దక్షిణ టిబెట్ (జాంగ్నాన్) అని చైనా చాలాకాలంగా వాదిస్తోంది. తమ మ్యాపుల్లో కూడా చూపిస్తూ వివాదాన్ని రాజేస్తోంది. అయితే, చైనా వాదనలను భారత్ ఎప్పటికప్పుడు తీవ్రంగా ఖండిస్తూ వస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని తేల్చి చెబుతోంది. ఈ నేపథ్యంలో పెమా ఖండు చేసిన వ్యాఖ్యలు చైనా వాదనను మరింత బలహీనపరిచేలా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటు..

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ఉద్దేశించి వైసీపీ నేత ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలు సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.మహిళలను కించపరిచేలా మాట్లాడటం వైకాపా నాయకులకు ఒక అలవాటుగా మారిపోయిందని పురందేశ్వరి విమర్శించారు. ఒక మహిళా శాసనసభ్యురాలిపై ఇంతటి అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని అన్నారు. ప్రసన్నకుమార్ రెడ్డి తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినా, వ్యక్తిగత దూషణలకు, ముఖ్యంగా మహిళల గౌరవానికి భంగం కలిగించే మాటలకు తావులేదని పురందేశ్వరి స్పష్టం చేశారు. వైసీపీ నాయకత్వం ఇలాంటి నేతలపై చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

# ఈ నెల 17న ఒక్క రైలును కూడా కదలనివ్వం: కవిత

బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వంతో ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న తలపెట్టిన 'రైల్ రోకో'ను విజయవంతం చేస్తామన్నారు. ఆ రోజు డెక్కన్ నుంచి ఢిల్లీ వైపు ఒక్క రైలును కూడా కదలనివ్వబోమని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో బీసీ వ్యతిరేకత పాతుకుపోయిందని ఆమె తీవ్రస్థాయిలో విమర్శించారు. తాను ఓబీసీ అని చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, ఇప్పుడు బీసీ వర్గాలకు న్యాయం చేసే గొప్ప అవకాశం వచ్చిందని కవిత అన్నారు. తెలంగాణ పంపిన బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించేలా ఆయన చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(డి) ప్రకారం, పెంచిన రిజర్వేషన్లను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి అధికారం ఉందని, కేవలం ఒక జీవో జారీ చేస్తే సరిపోతుందని ఆమె గుర్తుచేశారు. ఇదే క్రమంలో, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ చేయబోదని, బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కవిత స్పష్టం చేశారు.

# గిరిప్రదక్షిణకు పోటెత్తిన భక్తజన సమూహం





అక్షర విజేత. సింహాచలం:: ప్రఖ్యాత పుణ్యక్షేత్రం సింహాచలం గిరి ప్రదక్షణకు భక్తులు పోటెత్తారు, బుధవారం ఉదయం ఆరుగంటల నుంచి వివిధ జిల్లాల నుండి భక్తులు రావటం ప్రారంభించారు, ముందుగా స్వామి వారి తొలిపావంచా వద్ద స్వామి వారి ని దర్శించుకున్న అనంతరం కొబ్బరికాయ కొట్టి గిరిప్రదక్షిణ ప్రారంభించారు,మొత్తం 32 కిలోమీటర్లు తొలిపావంచా వద్ద మొదలైన ప్రదక్షిణ అడివివరం, సెంటర్ జైల్,హనుమంతువాక,అప్పుఘర్,ఎమ్.వి.పి,కంచరపాలెం,ఎన్ఎడి, గోపాలపట్నం నుండి సింహాచలం చేరుకుని స్వామి వారి ని దర్శించుకుని ప్రదక్షిణ పూర్తి చేస్తారు, ప్రదక్షిణ ప్రారంభం నుండి అడుగడుగునా త్రాగునీరు, టాయిలెట్లు, వైద్య సేవలను,జివిఎంసి,దేవస్థానం ఏర్పాటు చేయగా పలు స్వచ్ఛంధ సంస్థలు సమన్వయంతో భక్తుల కు ఫుడ్ ఏర్పాటు చేశారు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు, ఎప్పటికప్పుడు జివిఎంసి,రెవెన్యూ,వైద్య అధికారులు గిరిప్రదక్షిణ ప్రాంతాలను పర్యవేక్షించారు,దారి పొడవున సిసి కమేరాలు ఏర్పాటు చేసారు,పసి పిల్లలు తప్పిపోకుండా పోలీసులు క్యూఆర్ కోడ్ ఉన్న ట్యాగ్లు పిల్లలచేతికి వేసారు,అలాగె ప్రభుత్వ ప్రైవేటు అంబులెన్స్ లను అందుబాటులో ఉంచారు,ఉదయం పన్నెండు గంటలవరకూ సుమారు అరవై వేలమంది భక్తులు గిరిప్రదక్షిణ లో పాల్గొన్నారు,ముత్తంమీద ఈ సంవత్సరం ఐదు నుండి ఆరు లక్షల మంది భక్తులు గిరిప్రదక్షిణ లో పాల్గొన్నట్టుగా అధికారులు అంచనా వేస్తున్నారు, స్వామి వారి పుష్ప రథం సాయంత్రం నాలుగు గంటలకు స్వామి వారి తొలిపావంచా వద్ద మొదలై 32 క.మీ గిరి చుట్టూ తిరిగి స్వామి సన్నిధికి చేరుకుంటుంది,ఈ పుష్ప రథానికి దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతి రాజు కొబ్బరికాయ కొట్టి ప్రదక్షిణ ను ప్రారంభించారు.

## జిల్లాలోని రెడ్ క్రాస్ శాశ్వత భవనం కొరకు రాష్ట్ర శాఖకు వినతి..

అల్లూరి జిల్లా,పాడేరు, అక్షర విజేత:

అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శాశ్వత భవనం నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించాలని రాష్ట్ర శాఖకు గవర్నర్ సమక్షంలో రాష్ట్ర చైర్మన్ డాక్టర్ వై డి రామారావు కు అల్లూరి సీతారామరాజు జిల్లా బృందం వినతి పత్రం అందజేశారు. బుధవారం విజయవాడలో గల తుమ్మనపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఆరవ వార్షిక సర్వసభ్య సమావేశానికి జిల్లా బృందం హాజరైనన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ నజీర్ పాల్గొని ప్రసంగించారు. ఏజెన్సీలో సీజనల్ వ్యాధుల పట్ల, సికెన్ సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి మీ ఇంటికి మీ డాక్టర్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రజలకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని



సూచించారు. రక్తపు నిలువలు పెంచి ప్రాణాపాయంలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు రెడ్ క్రాస్ సొసైటీ ఎంతగానో కృషి చేస్తుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ గంగరాజు ప్రధాన కార్యదర్శి జి గౌరీ శంకర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, కోశాధికారి సూర్యారావు, సభ్యులు




సంజీవరావు,రవి,శ్రీనివాస్, ప్రసాద్, విజయలక్ష్మి, కృపారావు, సుబ్రహ్మణ్యం జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు ఫిజియోథెరపీ కార్యక్రమం..



అక్షర విజేత కోటనందూరు.

కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం కోటనందూరు మండలం కోటనందూరు నందు ఉన్న ఎంపిపిస్ మెయిన్ స్కూల్ నందు ఫిజియోథెరపీ క్యాంప్ బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ అవసరం అయిన పిల్లలకు పలు రకాల ఎక్సర్సైజ్ లు ఫిసియోథెరపీస్ట్ సోమేశ్వరరావు చేయించారు. సమగ్ర శిక్ష ద్వార అమలవుతున్న సదుపాయాలను సి డబ్ల్యూ ఎస్ ఎన్ పిల్లలు అందరూ ఉపయోగించుకోవాలని పిల్లల తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమములో ఐ ఈ ఆర్ పి లు ఎం.నాగగోవిందు, ఆర్. నారాయణరావు, ఆయా పిల్లలు,తల్లిదండ్రులు పాల్గొన్నారు

## అక్రమణలను వారం రోజుల్లోగా తొలగించాలని, లేని పక్షంలో మున్సిపాలిటీ స్వయంగా తొలగిస్తారు

**-రోడ్లపైకి వచ్చే వారిపై తీవ్ర చర్యలు తీసుకుంటాం**
**-జరిమానాలు విధించడంతో పాటు కేసులు కూడా పెడతాం**
**-మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు హెచ్చరిక**

అక్షర విజేత చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణంలో అక్రమణలకు గురైన రోడ్లు, ట్రాఫిక్ సమస్యలు మరియు ప్రమాదాలపై మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు మీడియాకు తెలిపారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసరావుపేట సర్కిల్ నుంచి నరసరావుపేటకు వెళ్లే దారిలో, టిడ్కో, పసుమరు ప్రాంతాలలో ఇళ్లు కేటాయించినప్పటికీ, ప్రజలు గుడిసెలు వేసుకుని రోడ్లపైనే వ్యాపారాలు కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు. అడ్డరోడ్డు సెంటర్లోనే కోటప్పకొండ రోడ్డులో షాపులు, కేబీ రోడ్డు, నరసరావుపేట సర్కిల్ నుంచి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం వైపు వెళ్లే రోడ్లలో కూడా ఆక్రమణలు అధికంగా ఉన్నాయని, దీని వల్ల ట్రాఫిక్ అంతరాయాలు, ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అనేకసార్లు ఆక్రమణలు తొలగించినప్పటికీ, వ్యాపారస్తులు తిరిగి రోడ్లపైకి వచ్చి ట్రాఫిక్ సమస్యలకుకారణమవుతున్నారని శ్రీహరి బాబు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, మున్సిపల్ అధికారులు త్వరలో రోడ్లపై మార్కింగ్ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. మార్కింగ్ దాటి రోడ్లపైకి వచ్చే వారిపై తీవ్ర చర్యలు తీసుకుంటామని, జరిమానాలు విధించడంతో పాటు కేసులు కూడా పెడతామని



ఆయన హెచ్చరించారు.ట్రాఫిక్ సమస్యలు లేకుండా, పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. అక్రమణలను వారం రోజుల్లోగా తొలగించాలని, లేని పక్షంలో మున్సిపాలిటీ స్వయంగా తొలగించి, అందుకు అయ్యే ఖర్చులను అక్రమణదారుల నుంచి వసూలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. దీనికి సంబంధించిన నోటీసులు రెండు మూడు రోజుల్లో సర్వ్ చేయబడతాయని ఆయన తెలియజేశారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా, సజావుగా కార్యకలాపాలు సాగించడానికి ప్రజలు, పోలీసులు సహకరించాలని ఆయన కోరారు



## ఏ ఆర్ కె ఆర్ పాఠశాల ఆవరణలోమొక్కలు నాటే కార్యక్రమం....

అక్షరవిజేత,భీమవరం:

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈరోజు భీమవరంలోని ఏ ఆర్ కె ఆర్ పాఠశాల ఆవరణలో ఏబీవీపీ 77వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జరిగిన మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి సుమన్ గారు అలాగే కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ మాత్యులు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ టిడిపి టౌన్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం రాజు అలాగే వివిధ కుటమి నాయకులు పాల్గొన్నారు కేంద్రమంత్రి వర్మ మాట్లాడుతూ విచ్చేసిన విద్యార్థులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి జ్ఞానం శీలం ఏకతా అనే లక్ష్యంతో గత 77 సంవత్సరాలుగా విద్యార్థి పరిషత్ విద్యార్థి రంగంలో అభివృద్ధి కోసం చేసిన కృషిని విద్యార్థులకు తెలియజేసి పాఠశాల ఆవరణలో మొక్క మొక్కని నాటి పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు అనే నినాదాన్ని విద్యార్థులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏబీవీపీ భీమవరం విభాగ్ కన్వీనర్ డిన్ను చందు జిల్లా కన్వీనర్ రాయి వెంకట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## చంద్రన్న బీమా చెక్కును బాధిత కుటుంబ యజమానికి అందజేసిన ప్రభుత్వ విప్ దివ్య...




అక్షర విజేత కోటనందూరు.

కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తుని మండలం టిడిపి క్యాంప్ కార్యాలయం తేటగుంట ఆపత్కాలంలో ఉన్న కార్యకర్తలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ప్రభుత్వ విఫ్ తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు.తుని మండలం రాజపేటకు చెందిన అర్లంక రామలక్ష్మి అనే తెలుగు మహిళా కార్యకర్త ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందింది.ఈమెకు పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో చంద్రన్న భీమా పథకాన్ని తెలుగు దేశం పార్టీ వర్తింపు చేసింది.5 లక్షలు భీమా చెక్కును తేట గుంట క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విఫ్ యనమల దివ్య బాధిత కుటుంబ యజమానికి అందజేసారు.ఈకార్యక్రమంలో రాజుపేట కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పరామర్శలు కూడా పథకాలు.. ప్రణాళికల ప్రకారం చేయడం జగన్ కే చెల్లింది : ప్రత్తిపాటి .



**- పంటగురించి..సాగు గురించి తెలియని వ్యక్తి పదవీకాంక్షతో ప్రభుత్వంపై బురదజల్లుతున్నాడు**
**- 2019 ఎన్నికలప్రచారంలో రైతులకిచ్చిన హామీల్లో జగన్ ఒక్కటీ నెరవేర్చలేదు.**
**- కిలో పొగాకు రూ.36వేలన్న వ్యక్తి.... ఇప్పుడు కిలోమామిడి రూ.3వేలన్నా ఆశ్చర్యం లేదు : ప్రత్తిపాటి.**

అక్షర విజేత చిలకలూరిపేట

“ రైతుల పరామర్శ పేరుతో గొప్పగా రక్తికట్టిద్దామన్న జగన్ నాటకం అభాసుపాలైంది. రైతులస్థానంలో కార్యకర్తల్ని ఉంచి బంగారుపాళ్యంలో వైసీపీ చేసిన విన్యాసాలను ప్రజలు ఛీ కొడుతున్నారు. పరామర్శల్ని కూడా పథకాలు... ప్రణాళికల ప్రకారం చేయడం జగన్ కే చెల్లింది తన హాయాంలో ప్రభుత్వవాటాగా పంటలబీమాకు విడుదల చేయాల్సిన సొమ్ము... చంద్రబాబు ప్రశ్నించేవరకు ఇవ్వని జగన్ నేడు రైతుల గురించి మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారు. రాష్ట్రంలో రైతాంగాన్ని ఆదుకోవడానికి కూటమిప్రభుత్వం అన్నిచర్యలు చేపట్టింది. రాజధానికి భూములిచ్చిన రైతులపై ప్రతీకారచర్యలకు పాల్పడిన వ్యక్తి.. రైతులసంక్షేమంపై మాట్లాడటం సిగ్గుచేటు. మామిడిలో ఎన్నిరకాలు ఉన్నాయో... ఏ రకం చెట్టుకి ఎన్నికాయలు కాస్తాయో తెలియని వ్యక్తి మామిడి రైతుల్ని పరామర్శించడానికి వెళ్లాడు. కిలోపొగాకు రూ.36వేలకు కొన్నారని చెప్పినట్టే.. ఇప్పుడు కిలోమామిడి రూ.3వేలు అన్నా ఆశ్చర్యంలేదు. పంటగురించి.. సాగు గురించి ఏమాత్రం అవగాహన లేని వ్యక్తి పదవీకాంక్షతో రగిలిపోతూ.. మంచిచేస్తున్న ప్రభుత్వంపై బురదజల్లుతున్నాడు.

**2019లో రైతులకు ఇచ్చిన హామీల్లో జగన్ ఒక్కటీ నెరవేర్చలేదు**

2019 ఎన్నికల ప్రచారంలో తాను ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలోరైతురాజ్యం వస్తుందని జగన్ ఊదరగొట్టింది నిజం కాదా? ప్రతి రైతు కుటుంబానికి పంటసాయంగా రూ.50వేల ఆర్థిక సాయం చేస్తానన్నాడు. రాష్ట్రంలోని ప్రతి రైతుకు వడ్డీలేని పంటరుణాలు అన్నాడు. ఉచితంగా బోర్లు వేయిస్తానన్నాడు. వ్యవసాయానికి పగటిపూటే 9గంటల నాణ్యమైన విద్యుత్ ఉచితం అన్నాడు. రైతులు పైసా కట్టకుండా ప్రభుత్వమే మొత్తం పంటలబీమా సొమ్ము చెల్లిస్తుంది అన్నాడు. రూ.3వేలకోట్లతో ధరలస్థిరీకరణ నిధి, రూ.4వేలకోట్లతో ప్రకృతి విపత్తుల సహాయ నిధి ఏర్పాటు చేస్తానన్నాడు. వీటిలో ఏ ఒక్కహామీని ఐదేళ్ల పాలనలో జగన్ అమలుచేయలేదు. పైగా చంద్రబాబు అంతకుముందు రైతులకు సబ్సిడీపై అందించిన డ్రిప్.. స్ప్రింక్లర్లు, యాంత్రీకరణ పరికరాలు, టార్పాలిన్లు.. ట్రాక్టర్లు పంపిణీని జగన్ పూర్తిగా పక్కన పెట్టేశాడు. తన ప్రభుత్వం, పార్టీలోని వారు రైతుల్ని లం...కొడుకలని తూలనాడినా, డ్రామాలాడుతున్నారని దెప్పిపొడిచినా జగన్ రైతులపక్షాన మాట్లాడలేదు. చంద్రబాబు అసెంబ్లీలో నేలపై కూర్చొని నిరసన తెలిపితే అర్ధరాత్రి అరకొరగా పంటల బీమాసాయం విడుదల చేయించిన వ్యక్తి జగన్. అలాంటి వ్యక్తి నేడు రైతులకు కష్టం వచ్చింది.. నష్టపోతున్నారని గగ్గోలు పెట్టడం కేవలం రాజకీయడ్రామానే.

**చంద్రబాబు, కూటమిప్రభుత్వం రైతులకు చేసేది జగన్ కు కనిపించదు**

సరైన ధరలేదని, రైతులు నష్టపోకూడదనే చంద్రబాబు మిర్చి, పొగాకు, కోకో, మామిడి ఉత్పత్తుల్ని ప్రభుత్వమే కొనేలా చేశారు. ఇప్పటికే పొగాకు రైతులకు రూ.270కోట్ల వరకు చెల్లించారు. మామిడికి ప్రభుత్వం తరుపున కిలోకు రూ.4లు చెల్లిస్తున్నారు. కర్ణాటకలో కిలోకు రూ.2లు మాత్రమే అక్కడిప్రభుత్వం ఇస్తుంటే అది జగన్ కు.. ఆయన సాక్షిపత్రికకు గొప్పగా కనిపించింది. చంద్రబాబు..కూటమిప్రభుత్వం చేసేది మాత్రం ఎప్పటికీ కనిపించదు. ఎందుకంటే ప్రజల సమస్యలు.. వారి కష్టసుఖాలు జగన్ కు అనవసరం. ఆయనకు కావాల్సింది అధికారమే. ఆ అధికార యావతోనే పర్యటనలు..పరామర్శల పేరుతో రాష్ట్రంలో అలజడి..ఆందోళనలు సృష్టించి తన పబ్బం గడుపుకునే ప్రయత్నాలు చేస్తున్నాడు.” అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో స్పష్టంచేశారు.

# కోటనందూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులుగా నాగేశ్వరావు ను నామినేట్ చేసిన యనమల..

అక్షర విజేత కోటనందూరు.
కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తుని మండలం టిడిపిక్యాంప్ కార్యాలయం తేటగుంట సీనియర్ నేత పెనుమచ్చ నాగేశ్వరరావు పట్టాభిషేకం.కాకినాడ జిల్లా కోటనందూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా నియమితులైయ్యారు కోటనందూరు మండలం లక్ష్మీ దేవిపేటకు చెందిన పెనుమచ్చ నాగేశ్వరరావు కాపు సామాజిక వర్గ నేత.తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయ ఆరంగేట్రం చేసిన నాగేశ్వ్రరావు అప్పట్నుంచీ ఇప్పటి వరకు మడమ తిప్పకుండా యనమల నాయకత్వంలో పనిచేసారు.ఎవరెంత ఒత్తిడి తెచ్చినా యనమలకు వీరవిధేయుడిగా ముద్ర వేసుకుని పెనుమచ్చ నాగేశ్వరరావు తెలుగుదేశమే సర్వసంగా పనిచేసారు.ఈ సీనియర్ నేత సేవలను గుర్తించిన యనమల....ముగ్గురు సభ్యులతో కూడిన కోటనందూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా పెనుమచ్చ నాగేశ్వరరావును నామినేట్ చేసారు.సహచరుడికి సముచిత స్థానం కల్పించిన యనమలకు కోటనందూరు మండల తెలుగు దేశం పార్టీ కృతజ్ఞతలు తెలిపారు ఇవాళ సీనియర్ నేత గాడి రాజబాబు ఆధ్వర్యంలో సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులు పెనుమచ్చ నాగేశ్వరరావు,ముప్పిడి జమీలు,బైలపూడి శ్రీరామ్మూర్తి తేట గుంట క్యాంప్ కార్యాలయంలో యనమలకు కృతజ్ఞతాభినందనలు తెలిపారు.ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంకంరెడ్డి రమేష్,మండల టిడీపీ అధ్యక్షుడు పోతల సూరిబాబు, చిటికెల సత్యనారాయణ, వెలగా వెంకట



కృష్ణారావు, వాసం నాగేశ్వ్రరావు సామినీడి కృష్ణార్జునుడు, అంకంరెడ్డి బుల్లి బాబు, రుత్తల శ్రీనివాస్, నెమ్మాది సత్యనారాయణ,చిట్టిమూరి జమీలు,జనసేనకు చెందిన పెనుమచ్చ నాగు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలు, రేషన్ షాపులు తనిఖీ చేసిన రాష్ట్ర ఆహార కమీషన్ చైర్మన్ చిత్త విజయప్రతాప్ రెడ్డి..

అక్షరవిజేత., ఏలూరు:-
జిల్లాలో పలు పాఠశాలలు, రేషన్ షాపులు, ఎమ్ఎల్ఎస్ పాయింట్లను బుధవారం రాష్ట్ర ఆహార కమీషన్ చైర్మన్ చిత్త విజయప్రతాప్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఏలూరు, భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల్లో పర్యటించారు. తొలుత ఏలూరు మహాత్మ జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో వంటశాల ,స్టోర్ రూమ్ పరిశీలించారు. గుడ్లు బరువు 45 నుంచి 55 గ్రాముల ఉండవలసిన గుడ్లు కొన్ని బరువు కేవలం 31 గ్రాముల ఉండడం గమనించి వీటికి సంబంధించిన సప్లయర్ను సంప్రదించి తక్కువ బరువు ఉన్న గుడ్లను వెంటనే రీప్లేస్మెంట్ చేయాలని, ఇకనుంచి ఇలాంటి పొరపాట్లు జరగకూడదని జరిగితే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడే కార్యక్రమంలో విద్యార్థులు ఫుడ్ మెనూ ప్రకారంగానే ఇస్తున్నారని హాస్టల్ లో అన్ని సౌకర్యాలు బాగున్నాయని విద్యార్థులు చైర్మన్ వారికి చెప్పారు. నచ్చని ఉప్మా తొలగించి ఎగ్ రైస్ ఇవ్వవలసిందిగా ప్రిన్సిపాల్ కు ఆయన సూచించారు. భీమడోలు మండలం గుండుగోలను గ్రామంలో ప్రభుత్వ రేషన్ షాపు మరియు మండల పరిషత్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటశాలలో పరిశీలించగా పిల్లలకు వండే రైస్ లో విటమిన్స్ తో కూడిన పోర్టిఫైడ్ రైస్ ప్రభుత్వం ఇస్తున్నదని, ఈ రైస్ గంజి వంచకూడదని ప్రభుత్వ నిబంధనలు వుండగా వాటికి విరుద్ధంగా గంజి వంచుతున్నారని, దీనిపై విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జిల్లాలో ప్రతి పాఠశాలలో గంజి వంచకుండా స్కూల్ హెడ్మాస్టర్లకు సూచనలు చేయవలసిందిగా ఆదేశించారు. పాతూరు ఎమ్ఎల్ఎస్ పాయింట్ పరిశీలించారు. రేషన్ బియ్యం రేషన్ డీలర్లకు బస్తా ప్రకారం కాకుండా తూకం ప్రకారమే రేషన్ డీలర్లకు అందజేయాలన్నారు. ద్వారకా తిరుమల మండలంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. వంటశాల , స్టోర్ రూమ్ తనిఖీలు నిర్వహించారు. 682 మంది విద్యార్థులకుగాను కేవలం నలుగురు వంటవాళ్లు మాత్రమే ఉన్నారని పాఠశాల ప్రిన్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకురాగా ఈ విషయంపై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భగా పిల్లలతో కలిసి భోజనం చేసిన ఆయన భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేస్తూ వంటచేసిన వారిని , పాఠశాల సిబ్బందిని అభినందించారు.ఈ తనిఖీల్లో జిల్లా బి.సి. సంక్షేమ శాఖ అధికారి ఆర్.వి. నాగరాణి, పౌర



సరఫరాల సంస్థ డిఎం శివరామమూర్తి, డిఎస్ఓ విలియంమ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ , లీగల్ మెట్రాలజీ , ఫుడ్ సేఫ్టీ అధికారులు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాస్యత పెంచడమే లక్ష్యంగా అక్షరాంధ్ర.

### ఈ ఏడాది ఆసక్తిగల వయోజనులైన 97,200 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చాలి..

### జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి..



అక్షరవిజేత., ఏలూరు:-
వయోజనుల్లో అక్షరాస్యతను పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉల్లాస్-అక్షరాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక కలెక్టర్ బంగ్లాలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి ఉల్లాస్ - అక్షరాంధ్ర జిల్లాస్థాయిఅధికారులతో
కన్వర్జేన్స్ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 100 గంటల శిక్షణతో ఈఏడాది 97,200 నిరక్షరాస్యులను అక్షరాశ్యులుగా తీర్చిదిద్దే ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. గత ఏడాది నిర్వహించిన ఉల్లాస్ కార్యక్రమం అమల్లో ఏలూరు జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో ఉందన్నారు. రాష్ట్రం వ్యాప్తంగా 2023 వ సంవత్సరంలో నిర్వహించిన క్యాస్ట్ సర్వే ద్వారా జిల్లాలో 15-59 సంవత్సరాలు మధ్య వయస్సు కలిగిన 3,16,441 మంది నిరక్షరాస్యులను గ్రామ , వార్డు సచివాలయాల శాఖల ద్వారా గుర్తించడం జరిగిందన్నారు. వారి నుండి ఏలూరు జిల్లాలో మొదటి విడతగా 2025-26 సంవత్సరం లో ఆసక్తిగల 97,200 మంది వయోజనులైన నిరక్షరాస్యులను ఎంపిక చేసి వారందరిని అక్షరాస్యులుగా చేయడానికి సంబంధిత శాఖల ద్వారా యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తదుపరి మూడు సంవత్సరాల్లో మొత్తం 3,16,441 మంది నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా చేసి ఏలూరు జిల్లాని అక్షరాస్యతలో మొదటి స్థానంలోకి తీసుకుని రావాలని సూచించారు.ప్రస్తుతం చేపట్టిన రెండో దఫా అక్షరాంధ్ర అక్షరాస్యత కార్యక్రమం ఈనెల 20వ తారీకు వరకు మండలాలలో వాలంటరీ టీచర్స్ ని గుర్తించి, వారికి మ్యాచింగ్ బ్యాచింగ్ ద్వారా పదిమందికి ఒక వాలంటరీ టీచర్ ని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఈనెల 21వ తారీకు నుండి 25వ తారీకు వరకు ఒకరోజు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈనెల 26వ నుండి ఆగస్టు 6వ తేదీ వరకు మండల స్థాయిలో వాలంటరీ టీచర్స్ కి, రిసోర్స్ పర్సన్స్ కి శిక్షణ కార్యక్రమాలు ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. ఆగస్టు 7వ తేదీ నుండి వచ్చే ఫిబ్రవరి వరకు 100 గంటల తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ శిక్షణ తరగతులలో వయోజనులైన నిరక్షరాస్యులకు ఫైనాన్షియల్ లిటరసీ, డిజిటల్ లిటరసీ, ఫంక్షనల్



లిటరసీ లలో శిక్షణ అందించాలన్నారు. అనంతరం మార్చి నెలలో వారికి పరీక్ష నిర్వహించాలన్నారు.
ఏలూరు జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి కెవివి సత్యనారాయణ మాట్లాడుతూ గత సంవత్సరం 2024 -25 సంవత్సరంలో ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమం ద్వారా 27 మండలాల్లో నిరక్షరాస్యులైన డ్వాక్రా గ్రూపు మహిళలను 7,321 మందిని గుర్తించి 7,286 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు.
సమావేశంలో జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి కె వి వి సత్యనారాయణ, జెడ్పి సిఇఓ శ్రీహరి, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, డిఇఓ ఎం. వెంకటలక్ష్మమ్మ, ఐసిడిజిఎస్ ఈఈ మల్లిక, వయోజన విద్య అసిస్టెంట్ ప్రాజెక్టర్ అధికారి విజయకుమార్, జిల్లా పంచాయితీ,మెప్మా అధికారులు పాల్గొన్నారు..

# నేటి యువత మత్తు పదార్థాలకు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి....

అక్షరవిజేత,భీమవరం :
డ్రగ్స్ గంజాయి ర్యాగింగ్ వల్ల విద్యార్థుల భవిష్యత్ నాశనం అవుతుందని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డా సుభాష్, డా శ్రీవిద్య అన్నారు. భీమవరం సీఎస్ఎన్ కళాశాలలో మంగళవారం యాంటీ ర్యాగింగ్ అండ్ ఈవి టీసింగ్ పై అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు ర్యాగింగ్ కు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల కార్యదర్శి చీడే సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆహార అలవాట్లు వ్యాయామం చేయడం ద్వారా దూర అలవాట్లుగా దూరంగా ఉండవచ్చునని అన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండి సలీం ఖాన్, డా వెంకటేశ్వ రరావు, చీడే కృష్ణారావు, హెచ్ వోడి బొమ్మదేవర ప్రభాక రరావు, నాగేంద్ర, రేవంత్, లోకేష్, వినయ్ అధ్యాపకులు పాల్గొన్నారు.



# ప్రతి చిన్నారికి ఆధార్ నమోదు

### ఐటిడి ఏ ఇంచార్జి పి ఓ, జెసి డా. ఎం. జె. అభిషేక్ గౌడ





అల్లూరి జిల్లా,పాడేరు, అక్షర విజేత:
ప్రతి చిన్నారి తప్పని సరిగా ఆధార్ నమోదు చేయాలని ఐటిడి ఏ ఇంచార్జి ప్రాజెక్టు అధికారి, జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ ఆదేశించారు. బుధవారం ఐటిడి ఏ కార్యాలయంలో గ్రామ వార్డు సచివాలయం, ఐసిడి ఏస్, పి ఎం యు అధికారులతో చిన్నారులకు ఆధార్, జనన ధృవీ కరణ పత్రాలు జారీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిడి ఏ పరిధిలో 4765 మంది పిల్లలకు ఆధార్ కార్డులు, 3484 మందికి జనన ధృవీ కరణ పత్రాలు లేవన్నారు. ఈనెలాఖరు లోగా ఆధార్ లేని చిన్నారులకు ఆధార్ జారీ చేయాలని సూచించారు. జనన ధృవికరణ పత్రాలు జారీ కి సచివాలయం కార్యదర్శి, వి ఆర్ ఓ, ఆర్ ఐ, తాహాశీల్దారులు సమన్వయంతో జనన ధృ వీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. ఆధార్ నమోదుకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు డబ్బులు చెల్లించాలని, మధ్య వర్తులు డబ్బులు చెల్లించకూడదన్నారు.ఈ సమావేశంలో ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ??. వేంకటేశ్వరరావు, గ్రామ వార్డు సచివాలయం నోడల్ అధికారి 2. ఎస్.కుమార్, జి ఎస్ డబ్లూ ఎస్ జిల్లా సమన్వయ కర్త కె. సునీల్, జి.మాడుగుల సిడిపి ఓ, కె.బిహెచ్. ఎం. మణి, పి ఎం యు అధికారి రాజేష్, ఆధార్ కో ఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గోన్నారు.

# మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను జయప్రదం చేయండి....

### -కెజిబి ప్రిన్సిపాల్ సిహేచ్ లక్ష్మి దేవి.



అక్షరవిజేత,మర్రిపాడు/నెల్లూరు బ్యూరో: మండల కేంద్రం మర్రిపాడు కెజిబీ పాఠశాలలలో నేడు 10వ తేదీన జరగబోయే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగును జయప్రదం చేయాలని కెజిబి ప్రిన్సిపాల్ సిహేచ్ లక్ష్మి దేవి. ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పర్చాలనే లక్ష్యంతో ఏపీ సర్కార్ చర్యలు చేపట్టిందని అందులోభాగంగా నేడు 10వ తేదీన మెగా పేరెంట్- టీచర్ మీట్ నిర్వహించినట్లు తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులు పూర్వ విద్యార్థులు సంబందిత పాఠశాలల్లో చదివిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, దాతలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కెజిబి పాఠశాల ప్రిన్సిపాల్ సిహేచ్ లక్ష్మి దేవి, మరియు పాఠశాల టీచర్లు కోరుతున్నారు .

# ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయాన్ని అభ్యసన. మేఘాలయ వ్యవసాయ దళం సందర్శన



అల్లూరి జిల్లా,పాడేరు, అక్షర విజేత:
ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నాచురల్ ఫార్మింగ్ పథకంలో భాగంగా, మేఘాలయ రాష్ట్రానికి చెందిన 30 మంది రైతులు, మహిళ లీడ్ రైతులు, ఫీల్డ్ కోఆర్డినేటర్ల బృందం ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు 10 రోజుల అవగాహన పర్యటనకు వచ్చారు. ఈ పర్యటనను రైతు సాధికార సంస్థ (%=ఖూా%) ఆధ్వర్యంలో నిర్వహించబడింది.ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా మేఘాలయ రైతులకు సముదాయ ప్రాతిపదికన నిర్వహించే ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అనుభవాత్మక శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు స్థానిక రైతులతో మంతనాలు జరిపి, నమూనా ఖేతర్లను సందర్శించి, మట్టిస్వస్త్య నిర్వహణ, మల్చింగ్, ఇంటర్క్రాపింగ్, బయోఇన్‌పుట్ తయారీ వంటి అంశాల్లో ప్రాత్యక్ష అనుభవం పొందారు.రాష్ట్రాల మధ్య వ్యవసాయ పరిజ్ఞానం పంచుకునే ప్రయత్నంగా ఈ పర్యటన విశేష ప్రాధాన్యత సంతరించుకుంది. మేఘాలయ నుండి వచ్చిన రైతులు ఆంధ్రప్రదేశ్‌లో అమలు అవుతున్న ప్రకృతి అనుసంధాన వ్యవసాయ పద్ధతులపై ఆకర్షితులై, తమ రాష్ట్రంలో కూడా వీటిని అనుసరించేందుకు ఆసక్తిని వ్యక్తం చేశారు.





# 32 మంది విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్స్ అందజేత....

-ప్రతిభకు పేదరికం అడ్డు రాకూడదు .. ఎమ్మెల్యే అంజిబాబు....



అక్షరవిజేత,భీమవరం

ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలలో 2024-25 విద్య సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన 32 మంది విద్యార్థులకు శ్రీతుమ్మలపల్లి మంగరాజు విశ్రాంతి భవనం ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమత్కాళీ వరప్రసాద్ బాబా ఆశ్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా మెరిట్ స్కాలర్ షిప్స్ ను అందించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ భీమవరంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు దాతలు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నారని, ఇంటర్ లో ఈ ఏడాది అత్యధిక శాతంలో ఉత్తీర్ణత సాధించారని, గత దశాబ్ద కాలంగా తుమ్మలపల్లి ట్రస్ట్ ద్వారా విద్య ఆర్థిక ప్రోత్సా హకాలు అందివ్వడం అభినం దనీయమని అన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు తుమ్మలపల్లి శివ మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డు రాకూడదని, ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్నామని అన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్, డిగ్రీ కళాశాలలో 90 శాతం మార్కులతో ప్రతిభ చాటిన 32 మందికి ఒక్కొక్కరికి రూ 2500 చొప్పున అందించామని తెలిపారు. వబిలిశెట్టి రామ కృష్ణ, కారుమూరి సత్య నారాయణ మూర్తి, భట్టిప్రోలు శ్రీనివాసరావు, తుమ్మలపల్లి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# జాతరలు గ్రామశాంతిని కోరుకుంటాయ్.....

36వ వార్డులో శ్రీమావుళ్ళమ్మ దుర్గమ్మ అమ్మవార్ల 12వ జాతర మహోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు....






అక్షరవిజేత ,భీమవరం :

మన సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా అమ్మవార్ల జాతర మహోత్సవాలు నిర్వహించడం మంచి విషయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజ నేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం 36వ వార్డు శ్రీమహిమాన్విత మావుళ్ళమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీమావుళ్ళమ్మ దుర్గమ్మ అమ్మవార్ల 12వ జాతర మహోత్సవాన్ని ఆదివారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ఆలయ అర్చకులు మధు శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవార్ల జాతరలు గ్రామశాంతిని కోరుకుంటాయని, 12 ఏళ్లుగా అమ్మవారి జాతర మహోత్సవాలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. అనంత రం అమ్మవారికి హారతులు ఇచ్చి దర్శించుకున్నారు. కార్య క్రమంలో జనసేన నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి, గొర్ల గోపి, ఆలయ కమిటీ సభ్యులు నూకెళ్ళ గణేష్, దుర్గారావు, కుమార్, దుర్గ ప్రకాష్, ప్రసాద్, ప్రకాష్, పండు, పౌలు, వాల్తేన్, ఏసు, కిరణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ




అక్షరవిజేత,మర్రిపాడు/నెల్లూరు బ్యూరో : సింగనపల్లి మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పసుపులేటి సంటెమ్మ సేవా సంస్థ ద్వారా జి.శ్రీనివాసులు సహకారంతో నోటు పుస్తకాలను పంపిణీ చేయడం జరిగినది.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టీ.ఎన్ పేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి,విద్యార్థుల సంక్షేమానికి దాతలు సహకరించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో సింగన పల్లి మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య,పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రాజేశ్వరి,ఏపీలగుంట మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు,ఉపాధ్యాయులు వీరభద్ర కుమారి,సబీహ,గ్రామస్తులు,తల్లిదండ్రులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటాలి....

-ఒకరోజు ఉద్యమ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు....



అక్షరవిజేత,భీమవరం బీ

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం మండలం పంజా వేమవరంలో ఎంజిఎన్ఆర్ఈఎస్ పథకంలో భాగంగా ఒకరోజు ఉద్యమ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని (వన మహోత్సవం) మంగళవారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని, ఎక్కడైతే మొక్కలను నాటామో వాటిని అలా వదిలి వేయకుండా వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. మొక్కలు నాటడం ఒక్కటే కాదు సంరక్షించడం, ప్రతి ఒక్కరూ ఒక్కొక్కరి పేరుతో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే అంజిబాబు పిలుపునిచ్చారు. ఏపీ మహిళా ఆర్థిక సహకార సంస్థ చైర్ పర్సన్ పీతల సుజాత మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని, అందుకు తమవంతుగా మొక్కలు నాటాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అంజి బాబు మొక్కలను నాటారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# మండలంలో సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా

## కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలి

సిఐటియు మండల కార్యదర్శి టి . భీమేశ్వరి ఏఐటియుసి. భాస్కర్ యాదవ్. సిపిఎం. మండల కార్యదర్శి హెచ్. జయరాజ్ డిమాండ్

అక్షర విజేత మంత్రాలయం

మంత్రాలయంలో అంగన్వాడీలు ఆశ పంచాయతీ కార్మికులు కేవీపీఎస్ రైతులు వివిధ ప్రజా సంఘాలు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరిగింది. ర్యాలీ ఐసిడిఎస్ ఆఫీసు నుంచి పంచాయతీ ఆఫీస్ వరకు అక్కడి నుంచి ఎమ్మార్వో ఆఫీస్ వరకు ర్యాలీగా వచ్చి ఎమ్మార్వో ఆఫీస్ ముందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని వారు నినాదం చేశారు ఈ సమ్మెను ఉద్దేశించి ఏఐటీయూసీ నాయకులు భాస్కర్ యాదవ్ సిఐటియు మంత్రాలయం మండల కార్యదర్శి టి భీమేశ్వరి సిపిఎం మంత్రాలయం మండల కార్యదర్శి హెచ్ జయరాజులు మాట్లాడుతూ నరేంద్ర మోడీ తీసుకొస్తున్న నూతన ఆర్థిక విధానాల వల్ల కార్మికులకు కష్టజీవులకు రైతులకు ప్రతి ఒక్కరికి ఇబ్బంది కలిగించే విధంగా ఉన్నాయని వారు అన్నారు ఏవైతే కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మిక వ్యవస్థను కాపాడాలని వారు కోరారు కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలి గ్రాడ్యుటీ



జీవో మార్పు చేయాలి రైల్వే విద్యుత్ స్టీల్ బ్యాంకు ఇన్సూరెన్స్ తదితర రంగాల్లో ప్రైవేటీకరణను ఆపాలి పంచాయతీ కార్మికులకు ఆశా వర్కర్లకు కనీస వేతనం 26000 ఇచ్చి ఆదుకోవాలి రైతులకు అన్నదాత సుఖీభవ 20000 రూపాయలు వెంటనే ఇవ్వాలి ఉపాధి కూలీలకు 210 దినాలు కల్పించాలి రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అట్లాగే దళితులకు సామాన్య ప్రజలకు సామాజిక భద్రత కల్పించి దేశంలో గాని రాష్ట్రంలో గాని దాడులు దౌర్జన్యాలు దళితులపై ఆపాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం



నాయకులు జి అంజి మారెప్ప అన్నారు అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ రమాదేవి కి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సిఐటియు నాయకులు టి ప్రాణేష్ టి లక్ష్మన్న రైతు సంఘం నాయకులు ఎస్ వీరేష్ అంగనవాడీలు విశాలాక్షి ప్రమీల శ్వేత స్వప్న ఆశ వర్కర్స్ రంగమ్మ సుజాత పుష్ప రాజమ్మ పంచాయతీ కార్మికులు ప్రకాశం ప్రసంగి ఇశ్రాయేలు అంతోనమ్మ కెవిపిఎస్ నాయకులు ఎలీషా దేవపుత్ర బి అనిల్ ఏఐవైఎఫ్ నాయకులు ఎం రాజు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ఏబీవీపీ 77వ ఆవిర్భావ దినోత్సవం

## జాతీయ పునర్నిర్మాణమే ఏబీవీపీ లక్ష్యం

అక్షర విజేత ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు పట్టణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. స్థానిక పెద్ద పార్క్ రోడ్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ఎత్తున విద్యార్థులతో శోభాయాత్ర గా వెళ్లి డా. బి. ఆర్ అంబేద్కర్ కి పూలమాల వేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య వక్త గా విచ్చేసిన వై. శ్రీనివాసులు గారు మాట్లాడుతూ ఏబీవీపీ విద్యార్థులలో దేశభక్తి, జాతీయ భావాలు , జాతీయ పునర్నిర్మాణం కలుగజేస్తూ విద్యారంగ సమస్యలపై ముందుండి పోరాడుతుందని నేటి విద్యార్థి రేపటి పౌరుడు కాదని, నేటి పౌరుడు గానే విద్యార్థులను తీర్చి దిద్దడమే కాకుండా దేశ వ్యతిరేక శక్తులను ఎదుర్కోవడానికి కావలసిన స్ఫూర్తిని అందిస్తుందన్నారు. ఏబీవీపీ కృషి ఫలితంగా దేశంలోని అందరికీ 18 సంవత్సరాలకే ఓటు హక్కు వచ్చిందన్నారు. ఇప్పుడు అమలు జరుగుతున్న నూతన జాతీయ విద్యా విధానం తేవడంలో ఏబీవీపీ ప్రముఖ పాత్ర పోషించింది అన్నారు. దేశానికి ఎటువంటి హాని జరిగినా ఉదాహరణకు బంగ్లాదేశ్ చొరుబాట దారులు, కాశ్మీర్ దేశ వ్యతిరేక శక్తులు, అస్సాం మిలిటెంట్లను ఎదుర్కోవడంలో ఏబీవీపీ కార్యకర్తలు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. మెడికల్ విద్యార్థుల కోసం విద్యార్థులలో మన జాతి కోసం పనిచేసే విధంగా కృషి చేస్తుందన్నారు. వివిధ రాష్ట్రాలలో ఏకం చేయడానికి ఎస్ ఈఐఎల్ కార్యక్రమాల ద్వారా వివిధ రాష్ట్రాలలో ఏకతా భావం ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలు కలిగించడానికి ఏబీవీపీ తోడ్పడుతుందన్నారు. ఎస్ ఎఫ్ డి ద్వారా ప్రకృతి రక్షించడానికి కోట్లాది మొక్కలను విద్యార్థుల చేత నాటించి పోషించే విధంగా అంతేకాకుండా కరోనా సమయంలో దేశ ప్రజలకు ఏబీవీపీ ముందు ఉండి సేవలు అందించింది అన్నారు, ఉచిత బ్లడ్ బ్యాంకులో, ఉచిత కోచింగ్ సెంటర్లు, సెమినార్లు, విద్యార్థునులకు మిషన్ సాహసి ద్వారా శిక్షణ ఇచ్చి వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించడం జరుగుతుందన్నారు. ఇటువంటి అనేక కార్యక్రమాలే కాకుండా దేశ నాయకుల జయంతులు ,వర్ధంతులు నిర్వహిస్తూ సామాజిక సేవలో అందరిని భాగస్వామ్యం చేస్తుందన్నారు.

అలాగే ఏబీవీపీ నాయకులు మారుతి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ఇప్పటికప్పుడు ప్రభుత్వాలను హెచ్చరిస్తూ ఫీజు రిబర్స్మెంట్ అయితేనేమి స్కాలర్షిప్లు అయితేనేమి విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలను సక్రమంగా అమలు జరిగేలా ఏబీవీపీ కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు ఉచిత ఎంసెట్ కోచింగ్ లు మెడికల్ క్యాంపులు మరియు యూనివర్సిటీలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా హెల్ప్ డెస్క్ నిర్వహించడం జరుగుతుందన్నారు. యూనివర్సిటీలలో ర్యాగింగ్ లను జరగకుండా ఏబీవీపీ నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. జాతీయభావ వ్యాప్తి కొరకు ఏబీవీపీ కార్యకర్తలు



అయినటువంటి సామా జగనన్న లాంటి వందలాది కార్యకర్తలు విదేశీ భావజాలం ఉన్న గుండాల చేతిలో బలి కావడం జరిగిందన్నారు. వారి బలిదానం చేత కారణంగా ఈరోజు ఏబీవీపీ అంత్య అంచెలుగా ఎదిగి దేశం నలుమూలల కాకుండా ప్రపంచవ్యాప్తంగా వ్యాపించిందన్నారు. విద్యార్థి సంఘాలలో ప్రపంచంలో అత్యధిక సభ్యత్వాలు గల ఏకైక విద్యార్థి సంఘంగా ఏబీవీపీ గుర్తించబడింది అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వేణు గోపాల్, జావీద్, మల్లికార్జున, చిన్న బాబు మరియు కార్తీక్ లు పాల్గొన్నారు

# విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎస్ ఐ,కానిస్టేబుల్ కుటుంబాలకు తమ వంతు ఆర్థిక సహాయం

అక్షర విజేత ఆలమూరు

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గ ఆలమూరు మండల ఎస్ ఐ, కానిస్టేబుల్ గత నెల 26న విధి నిర్వహణలో భాగంగా ఆలమూరు నుంచి హైదరాబాదు వెళుతున్న ఆలమూరు పోలీస్ స్టేషన్ ఎస్సై మద్దాల అశోక్, ఆత్రేయపురం కానిస్టేబుల్ బ్లెసన్ జీవన్ లు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందినారు. ఆ కుటుంబాలకు తోడుగా మేము ఉన్నాము అంటూ, డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కు చెందిన అన్నీ పోలీస్ స్టేషన్ ల సిబ్బంది, సబ్ ఇన్స్పెక్టర్ లు, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇన్స్పెక్టర్ లు అందరూ కలిసి ఎస్సై మద్దాల అశోక్ కుటుంబానికి రూ. 4 లక్షలు బ్లెసన్ జీవన్ కుటుంబానికి రూ. 4 లక్షలు కలిపి మొత్తం రూ. 8 లక్షలు చెక్కులను అదే విధముగా 2014 బ్యాచ్ కు చెందిన సబ్ ఇన్స్పెక్టర్ లు అదనముగా 68 వేల రూపాయల చెక్కు ను జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని తెలిపారు



# మండలంలో సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా

# కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలి

**సిఐటియు మండల కార్యదర్శి టి . భీమేశ్వరి ఏఐటియుసి. భాస్కర్ యాదవ్. సిపిఎం. మండల కార్యదర్శి హెచ్. జయరాజ్ డిమాండ్**

అక్షర విజేత మంత్రాలయం

మంత్రాలయంలో అంగన్వాడీలు ఆశ పంచాయతీ కార్మికులు కేవీపీఎస్ రైతులు వివిధ ప్రజా సంఘాలు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరిగింది. ర్యాలీ ఐసిడిఎస్ ఆఫీసు నుంచి పంచాయతీ ఆఫీస్ వరకు అక్కడి నుంచి ఎమ్మార్వో ఆఫీస్ వరకు ర్యాలీగా వచ్చి ఎమ్మార్వో ఆఫీస్ ముందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని వారు నినాదం చేశారు ఈ సమ్మెను ఉద్దేశించి ఏఐటీయూసీ నాయకులు భాస్కర్ యాదవ్ సిఐటియు మంత్రాలయం మండల కార్యదర్శి టి భీమేశ్వరి సిపిఎం మంత్రాలయం మండల కార్యదర్శి హెచ్ జయరాజులు మాట్లాడుతూ నరేంద్ర మోడీ తీసుకొస్తున్న నూతన ఆర్థిక విధానాల వల్ల కార్మికులకు కష్టజీవులకు రైతులకు ప్రతి ఒక్కరికి ఇబ్బంది కలిగించే విధంగా ఉన్నాయని వారు అన్నారు ఏవైతే కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మిక వ్యవస్థను కాపాడాలని వారు కోరారు కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలి గ్రాడ్యుటీ జీవో మార్పు చేయాలి రైల్వే విద్యుత్ స్టీల్ బ్యాంకు ఇన్సూరెన్స్ తదితర రంగాల్లో ప్రైవేటీకరణను ఆపాలి పంచాయతీ కార్మికులకు ఆశా వర్కర్లకు కనీస వేతనం 26000 ఇచ్చి ఆదుకోవాలి రైతులకు అన్నదాత సుఖీభవ 20000 రూపాయలు వెంటనే ఇవ్వాలి ఉపాధి కూలీలకు 210 దినాలు కల్పించాలి రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అట్లాగే దళితులకు సామాన్య ప్రజలకు సామాజిక భద్రత కల్పించి దేశంలో గాని రాష్ట్రంలో గాని దాడులు దౌర్జన్యాలు దళితులపై ఆపాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు జి అంజి మారెప్ప అన్నారు అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ రమాదేవి కి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సిఐటియు నాయకులు టి ప్రాణేష్ టి



లక్ష్మన్న రైతు సంఘం నాయకులు ఎస్ వీరేష్ అంగనవాడీలు విశాలాక్షి ప్రమీల శ్వేత స్వప్న ఆశ వర్కర్స్ రంగమ్మ సుజాత పుష్ప రాజమ్మ పంచాయతీ కార్మికులు ప్రకాశం ప్రసంగి ఇశ్రాయేలు అంతోనమ్మ కెవిపిఎస్ నాయకులు ఎలీషా దేవపుత్ర బి అనిల్ ఏఐవైఎఫ్ నాయకులు ఎం రాజు తదితరులు పాల్గొన్నారు

# కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటిత పోరాటాలకు సంసిద్ధం కావాలి - ప్రజా సంఘాలు

**సార్వత్రిక సమ్మెకు రైతు కూలీ సంఘం, ఆదివాసి గిరిజన సంఘం, అంగన్వాడి, ఆశా వర్కర్ల నిరసన.**

**సార్వత్రిక సమ్మెకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు - కారం భాస్కర్.**

అక్షర విజేత / బుట్టాయగూడెం.

పోలవరం మండల కేంద్రం లోని గంగాభవాని థియేటర్ నుండి నిరసన ప్రదర్శన ఏటుగట్టువరకు జరిగింది. అనంతరం ఏటిగట్టు సెంటర్లో రాస్తారోకో నిర్వహించి రైతాంగ, కార్మిక, ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినదించారు. ఈ నిరసన కార్యక్రమానికి ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కు%శీ%జం రామారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీని అమలు చేయలేదని, రైతాంగం పండించే పంటలకు కనీస మద్దతు ధరల చట్టాన్ని ఇంతవరకు తీసుకు రాలేదని దీనివల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అమెరికా తో చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాల వల్ల మన దేశ వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకు పోతుందని ఆ విధానాల నుండి కేంద్ర ప్రభుత్వం వెనక్కి రావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున రైతాంగం నుండి భూములు గుంజుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తుందని, రాజధాని పేరుతో మరో



42,000 ఎకరాల భూములను గుంజుకోవడం కోసం పథకం సిద్ధం చేసిందని అన్నారు. రైతాంగ వ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటిత పోరాటాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసి గిరిజన సంఘం కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం కార్మికుల సమస్యలను రైతాంగ సమస్యలను పరిష్కరించట్లేదని భారత దేశ ప్రజల సంపదను అంబానీ, ఆదానీలకి అప్పగిస్తున్నారని అన్నారు. అంగన్వాడి ఆశా వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను కుదించివేసి నాలుగు లేబర్ కోడ్ లను అమల్లోకి తీసుకువచ్చి కార్మిక వర్గానికి ఉన్న హక్కులన్నిటిని హరిస్తున్నారని విమర్శించారు.



కార్మికులు మరియు రైతుల సమస్యలను పరిష్కారం చేయకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సార్వత్రిక సమ్మెకు పోలవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సొబ్బన రాజశేఖర్ బాబు , క్లబ్ సభ్యులు సంఘీభావం తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి పి ఎల్ ఎస్ కుమారి, వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి ఎస్ సాయి కృష్ణ , ఏజెన్సీ గిరిజన సంఘ నాయకులు కొమరం రామారావు, దాడి రాముడు, మడి వెంకటగిరి, ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘ మండల అధ్యక్ష ,కార్యదర్శులు బొరగం భూ చంద్రరావు, గోకూరి పాండవులు, ధర్ముల లక్ష్మి , సరస్వతి పాల్గొన్నారు.

# లాయర్ కృష్ణకు సముచిత స్థానం కల్పించిన యనమల.

అక్షర విజేత కోటనందూరు.

కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తుని మండలం తేటగుంట సీనియర్ నేత లాయర్ కృష్ణకు యనమల సముచిత స్థానం కల్పించారు. తెలుగు దేశం పార్టీకి వీరవిధేయుడిగా సుదీర్ఘకాలంగా నిస్వార్థ సేవలందించిన పేరూరి వెంకట చిన్న కృష్ణయ్య ఇదే తరహాలో రైతులకు మెరుగైన సేవలందించేందుకు లాయర్ కృష్ణకు ఎన్ ఎన్ పట్నం సొసైటీ అధ్యక్ష పగ్గాలు అందిపుచ్చుకున్నారు. డైరెక్టర్లుగా చోడ్రాజు చిరంజీవి రాజు,లాలంరాజేశ్వరి నామినేట్ అయ్యారు. ఈనేపధ్యంలో లాయర్ కృష్ణ ఆధ్వర్యంలో పాలక వర్గ సభ్యులు సీనియర్ నేతలతో కలిసి యనమలను మర్యాదపూర్వకంగా కలిశారు. తేటగుంట క్యాంప్ కార్యాలయంలో టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల ను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు రైతుల అవసరాలకు అనుగుణంగా పాలక మండలి పనిచేయాలని యనమల సూచించారు. తమపై మోపిన గురుతర బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని లాయర్ కృష్ణ అన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నేతలు యనమల రాజేష్ చింతంనీడి అబ్బాయి మోతుకూరి వెంకటేష్ తేటగుంట నేతలు గజ్జి అప్పలరాజు,గజ్జి రాంబాబు,



కొల్లు సత్యనారాయణ,కోన కన్నారావు, చామంతి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# కోటనందూరులో బంద్ విజయవంతం....

## -సిఐటియు పద్మ.

అక్షర విజేత కోటనందూరు.

కాకినాడ జిల్లా, తుని నియోజకవర్గం కోటనందూరు మండలం కోటనందూరులో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి షేక్ పద్మ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ సూరిబాబు, ట్రాన్స్పోర్ట్ రంగం నుండి ముక్కుడుపల్లి బాబురావు ఆధ్వర్యంలో కార్మికులు, ప్రజా సంఘాలు ఇచ్చిన భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా కోటనందూరు లో విజయవంతం చేశారు. తాహసిల్దార్ కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి బందు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికులైన కనీస వేతనం నెలకు 26 వేలు చెల్లించాలని, కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని, పని ప్రదేశంలో భద్రతా సౌకర్యాలు కల్పించాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ డైలీ వేజ్, కంటింజెంట్ స్కీమ్ వర్కర్లు అందరినీ రెగ్యులర్ చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ తో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ ఆపాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి రోజుకు 600 రూపాయలు వేతనం ఇవ్వాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం తాహసిల్దార్ పీవీవీ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు దాడి గోవిందరావు, మండల ప్రధాన కార్యదర్శి షేక్ తాజుద్దీన్ బాబా, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఏ సత్యనారాయణ, అంగన్వాడి నాయకురాలు డి శ్రీదేవి, కే పద్మ ,ఎం దుర్గ, ఆశా వర్కర్ల నాయకులు కే మరియారత్నం, ఎన్ నూక రత్నం, ఏ కుసుమ, రవాణా కార్మిక సంఘం నాయకులు మహమ్మద్ రుఫీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు మిరియాల దేవుడమ్మ, డి సత్యవతి, స్కూల్ ఆయాలు ఏ అప్పలనరస, రోహిణి, భవన నిర్మాణ కార్మికులు బొజ్జ నూకరాజు, యేసు, ఏలేటి అప్పారావు, పంచాయతీ కార్మికులు గుండంపల్లి మరిణియ్య, కే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.









# ప్రమాదాలకు నిలయంగా మారిన సున్నిపెంట రోడ్లు



అక్షరవిజేత, శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం మండలం సున్నిపెంట గ్రామంలో స్టోర్ సెంటర్, బస్టాండు, వెస్ట్రన్ కాలనీ ప్రతి ఒక్క ప్రదేశాలలో ప్రధాన రహదారులన్నీ అడుగడుగున గోతులతో అధ్వానంగా మారడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. ద్విచక్ర వాహనాలు, పెద్ద వాహనాలు రాకపోకలు చేసేవారికి నరకం చూపిస్తున్నాయి. వాహనం వినియోగదారులు టైర్లు, సస్పెన్షన్ మొదలైనవి దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. ద్విచక్ర వాహనాలు ప్రతినిత్యం ప్రమాదాలకు గురవుతున్నాయి. వర్షం కురిస్తే రోడ్లపై ఏర్పడిన గోతులలో నీరు ఉండటంతో గోతులు కనిపించక వాహనాలు గోతులలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం నడిచి వెళ్లేందుకు వీలు లేని పరిస్థితులలో రోడ్లు ఉన్నాయి. గత ప్రభుత్వం ప్రధాన రహదారుల మరమ్మత్తులు పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రమాదాలు జరగకుండా రోడ్ల మరమ్మత్తులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



# కోర్టు భవనాల నిర్మాణానికి స్థలం పరిశీలించిన. ఎమ్మెల్యే డాక్టర్. బి.వి

**-సబ్ కోర్టు, అడిషనల్ కోర్టు మంజూరు**

**-ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయనాగేశ్వర్ రెడ్డి**



అక్షర విజేత ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరుకు సబ్ కోర్టు, అడిషనల్ కోర్టు మంజూరు పట్ల భవనాల నిర్మాణానికి న్యాయవాదులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయనాగేశ్వర్ రెడ్డి. బుధవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి. మాట్లాడుతూ జ్యూడిషల్ వ్యవస్థ అత్యంత ముఖ్యమైనదని, శాశ్వత భవనాలు నిర్మాణానికి మూడు చోట్ల స్థలాలు పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందరికీ అనుకూలంగా ఉండే విధంగా నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాడు నా తండ్రి మాజీ మంత్రి బీవీ. మోహన్ రెడ్డి. ఏర్పాటు చేసినటువంటి కోర్టు నేటి వరకు కొనసాగుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రషీదుల్లా, సీనియర్ న్యాయవాదులు లక్ష్మీనారాయణ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, న్యాయవాదులు రామకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్...

-విద్యాసంస్థల సమీపాన ఉన్న రిటైల్ దుకాణాల నందు విస్తృత తనిఖీలు....

-ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్" కార్యక్రమంలో భాగంగా, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి , ఐపీఎస్.,వారి ఆదేశానుసారం విద్యాసంస్థల సమీపాన ఉన్న రిటైల్ దుకాణాల నందు విస్తృత తనిఖీలు నిర్వహిస్తు న్న పశ్చిమగోదావరి జిల్లా పోలీసు యంత్రాంగం...

-విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తులు, గుట్కా, ఇతర నిషేధిత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల అమ్మకాలను నివారించుటయే ధ్యేయంగా జిల్లావ్యాప్తంగా పోలీసుల ఆకస్మిక దాడులు..........

-యువత భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తుల నిల్వలు కలిగి ఉన్న, అక్రమంగా వాటిని విక్రయాలు జరిపిన చట్ట ప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్న జిల్లా ఎస్పీ........

అక్షరవిజేత,భీమవరం:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గంజా యి రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దాలన్న ప్రభుత్వ ఆశయాలు అనుగుణముగా రాష్ట్ర డిజిపి హరీష్ గుప్తా ఉత్తర్వుల మేరకు పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి , ఐపీఎస్., ఆదేశానుసారం "ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్" కార్యక్రమంలో భాగంగా జూలై 9 న బుధవారం నాడు పోలీసు అధికారులు జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాల/కళాశాలల సమీపంలో ఉన్న దుకాణాలలో ఆకస్మిక దాడులు చేసి, క్షుణ్ణం గా సోదాలు నిర్వహించారు.ఈ దాడులలో భాగంగా దుకా ణాలలో విక్రయిస్తున్న నిషేధిత గుట్కా, పాన్, ఖైనీ మరియు సిగరెట్ వంటి మొదలగు హానికర ఉత్పత్తులు ధ్వంసం చేసి, దుకాణ యజమానుపై కేసులు నమోదు చేయడం జరిగింది. పోలీసు అధికారుల ఆదేశాలను ధిక్కరిస్తూ, చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. విద్యాసంస్థలలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం మరియు వినియోగానికి సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే తక్షణమే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ సోదా లు నిరంతరం కొనసాగుతా యని,యువతను పాడు చేసే మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తుల నిల్వలు కలిగి ఉన్న, అక్రమంగా వాటిని విక్రయాలు జరిపిన ఏ మాత్రం ఉపేక్షించేది లేదని, అటువంటి షాపు యజమానులపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామ ని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో జిల్లాలోని ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఈగల్ టీం అధికారులు, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.





## సమైఖ్య భారత వని కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుడు డా శ్యాంప్రసాద్ ముఖర్జీ....

-పట్టణ బిజెపి ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు....

అక్షరవిజేత,భీమవరం
సమైఖ్య భారత వని కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులు డా శ్యాంప్రసాద్ ముఖర్జీ అని బిజెపి జిల్లా కార్యదర్శి అల్లూరి సాయి దుర్గరాజు అన్నారు. ఆదివారం బిజెపి భీమవరం పట్టణ శాఖ ఆధ్వర్యంలో జనసంఘ్ వ్యవస్థాపకులు డా శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని రాయలంలోని శ్యాం ప్రసాద్ ముఖర్జీ విగ్రహం వద్ద నిర్వహించారు. ముందుగా ముఖర్జీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సాయి దుర్గరాజు మాట్లాడుతూ డా శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధన కోసం అంకితభావంతో ముందుకు సాగాలన్నారు. బీజేపీ భీమవరం పట్టణ పడమర, తూర్పు అధ్యక్షులు వబిలిశెట్టి ప్రసాద్ రావు, అడబాల శివ మాట్లాడుతూ ఒకే దేశం, ఒకేప్రధాని, ఒకే రాజ్యాంగం శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయమన్నారు. కాశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తి కలిగించే ఆర్టికల్ 370ని కాంగ్రెస్ పార్టీ విధానాన్ని




ముఖర్జీ వ్యతిరేకించారని, దేశ విభజన, బెంగాల్ విభజనను ముఖర్జీ వ్యతిరేకించారని, ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే ప్రధాని అంటూ ఏక్ భారత్ అనే నినాదంతో అందరిని ఏకతాటిపై తీసుకురావడానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి ముఖర్జీ అని అన్నారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, మల్లికార్జునరావు, కెల్లా సూర్యచంద్రరావు, చదలాడి విజయభాస్కర్, నాగ బత్తుల రాజేంద్ర, మల్లుల



గంగాధర్ రావు, పచ్చిగుళ్ళ వెంకటేశ్వరరావు, కెల్లా లక్ష్మణరావు ఎస్ కే బాజీ, అందే త్రిమూర్తులు, జీవీఎస్ గుప్తా, గాదంశెట్టి వెంకటేశ్వరరావు, గండికోట వెంకన్న, సాయికృష్ణ, మురళీకృష్ణ, నేరెళ్ల కోటేశ్వ రరావు, పెద్దేటి సుబ్బారావు గొట్టుముక్కల సుబ్రహ్మణ్యం రాజు, చీరే బ్రహ్మానందం, నున్న సూర్య, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం మహాదానమని, రక్తదానంపై అపోహాలు వద్దు .. -రోటరీ క్లబ్....

అక్షరవిజేత,భీమవరం :
రక్తదానం మహాదానమని, రక్తదానంపై అపోహాలు వద్దని, ఆపదలో ఉన్న వారి ప్రాణాలను రక్షించడానికి సేకరించిన రక్తం ఎంతో ఉపయోగపడుతుందని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుండు కిషోర్, మండ విజయ్ భాస్కర్, కోశాధికారి బోండా సుబ్బారావు అన్నారు. భీమవరం మండలం రాయలం లోని ఇండియన్ రెడ్ క్రాస్ భవనంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండే ప్రతి మనిషి ప్రతీ 5 నెలలకొకసారి రక్తదానం చేయడం ద్వారా శరీరం మరింత ఉత్సాహవంతంగా మారుతుందన్నారు.యువత రక్తదానం వంటి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు సర్టి ఫికెట్స్ ను అందించారు. అక్షిం తల సత్య సురేష్, అక్షింతల మంగేష్ తదితరులు పాల్గొన్నారు







## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిల్స్, నోటు పుస్తకముల పంపిణీ

కందుకూరు,
చేయి చేయి కలుపుదాం ఆపదలో ఉన్న వారిని ఆదుకుందాం.. అనే నినాదంతో మేక్ ఏ చేంజ్ సొసైటీ కందుకూరు వారి సహకారంతో కందుకూరు మండలం గొల్లవారి పాలెం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు భోజనం ప్లేట్లు, వాటర్ బాటిల్స్, నోటు పుస్తకములు,బోధనా సామాగ్రిని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ ఈ పాఠశాలలో తో విద్యార్థులు చాలా పేదవారు, వారికి అవసరమైన విద్యా సామాగ్రి అందించినందుకు సొసైటీ సభ్యులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేక్ ఏ చేంజ్ సొసైటీ సభ్యులు పి.గౌతమ్ శివ తేజ, రవ్వా శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మ, పాల్గొన్నారు.

## మండలంలోని పోలింగ్ బూతులను పరిశీలించిన రెవెన్యూ డివిజనల్ అధికారి.

హనుమంతునిపాడు : మండలం లోని జిల్లా ఉన్నత పాఠశాల యందు గల పోలింగ్ బూతు 24 మరియు కుటాగుండ్ల గ్రామం లోని మండల ప్రాథమిక పాఠశాల యందు గల పోలింగ్ బూతు 15 ను సందర్శించి సదరు పోలింగ్ బూతుల యందు గల వసతులు మరియు అక్కడి బిఎల్ఓ లతో సంప్రదించి అక్కడి ఓటర్ల వివరములను అడిగి తెలుసుకోవడం జరిగినది. కుటగుండ్ల పోలింగ్ బూతు యందు ఓటర్లు ఎక్కువగా ఉన్నందువలన అక్కడ మరియొక పోలింగ్ ఏర్పాటు చేయుటకు గల అవకాశాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం నందు మండల తహశీల్దార్ వారు , రెవెన్యూ ఇన్స్పెక్టర్, ఎలక్షన్ ఆపరేటర్, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మేము సైతం అంటూ జిల్లా పోలీసుల చేయూత

ఆలమూరు, ఇటీవల విధి నిర్వహణలో భాగంగా ఆలమూరు నుంచి హైదరాబాదు వెళుతున్న ఆలమూరు ఎస్సై మద్దాల అశోక్, ఆత్రేయపురం కానిస్టేబుల్ బ్లెసన్ జీవన్ లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి కుటుంబాలకు తోడుగా మేము ఉన్నాము అంటూ డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన అన్నీ పోలీస్ స్టేషన్ ల సిబ్బంది, ఎస్సైలు, సిఐలు అందరూ కలిసి ఎస్సై మద్దాల అశోక్ కు రూ.4 లక్షలు, బ్లెసన్ జీవన్ లు రూ.4 లక్షలు కలిపి మొత్తం రూ.8 లక్షలు చెక్కులను జిల్లా ఎస్పీ బి కృష్ణారావుగారి చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అదే విధముగా 2014 బ్యాచ్ కు చెందిన ఎస్సైలు అదనముగా సమకూర్చిన రూ.68 వేల చెక్కును జిల్లా ఎస్పీ గారి చేతుల మీదుగా ఎస్సై మద్దాల అశోక్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

## సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

ఉలవపాడు, జూలై :-09
కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, యజమానులతో బేరసారమాడే హక్కు లాంటివి 29 కార్మిక చట్టాలను కార్మిక నాలుగు లేబర్ కోడ్ గా మార్చి కార్మికుల హక్కులు హరించే విధానాన్ని రద్దు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను అమలు చేయాలని, అంగన్వాడి, ఆశా వర్కర్లను వర్కర్లుగా గుర్తించాలని, కార్మికులకు కనీస భద్రత సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఈరోజు కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు భాగంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కార్యక్రమం. ఈ సమ్మె కార్యక్రమంలో అంగన్వాడి, ఆశా, ఆటో, మధ్యాహ్న భోజన కార్మికులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి సిఐటియు మండల నాయకురాలు సిహెచ్ ఇందిరా వతి అధ్యక్షత వహించింది. సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని పాల్గొని సమ్మె ఉదేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పి టి పి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు సవరం శ్రీనివాసులు, గంజి శ్రీనివాసులు, కోశాధికారి చిలకా శ్రీనివాసులు, ఆఫీస్ లబేరర్లు పాల్గొన్నారు, అంగన్వాడి రంగం నుండి సిహెచ్ పద్మజ, ప్రసన్న, ఎం పద్మావతి, ఎస్ గీత, ఆశా రంగం నుండి ఎం జయ, డి కోటేశ్వరి, ఆటోరంగం నుండి ఎస్. డి జహీర్, మధ్యాహ్న భోజనం నుండి యశోద, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కత్తి సుజాత, దువ్వూరి జాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు మెగా పీటీఎం2.0లో పాల్గొనాలి

**-మీ పిల్లల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమం ఇది.. ఎమ్మెల్యే పరిటాల సునీత**

**-మెగా పీటీఎంకి ఎమ్మెల్యే సునీతకు విద్యాశాఖ అధికారుల ఆహ్వానం**

**-ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు ఉండకూడదని ఆదేశం -గ్రీన్ పాస్ పోర్ట్ గురించి అవగాహన కల్పించాలని సూచన**



:జూలై 9
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తెస్తోందని.. అందులో భాగంగా నిర్వహించే మెగా పీటీఎం2.0 కార్యక్రమంలో ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొనాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్, ఎస్ఎస్ఏ పీఓ శైలజ ఇతర అధికారులు ఎమ్మెల్యే సునీతను అనంతపురం క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేకంగా కలిశారు. మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ కు ఆహ్వానం పలికారు. అలాగే గ్రీన్ పాస్ పోర్టులను ఆవిష్కరించారు. గురువారం రోజు చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. మెగా పీటీఎం2.0ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని.. ఎక్కడా ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలనే లక్ష్యంతో, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం నెలకొల్పడానికి మెగా పీటీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రాథమిక పాఠశాలల నుంచి జూనియర్ కళాశాలల వరకు పండగ వాతావరణంలో ఈ సమావేశాలు ఉంటాయన్నారు. ఇతర పనులు ఉన్నాయని.. తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి గైర్హాజరు కావద్దన్నారు. ఇక్కడ మీ పిల్లలకు సంబంధించిన అనేక విషయాలు, ప్రభుత్వం విద్యా పరంగా చేస్తున్న కార్యక్రమాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. మీ పిల్లల భవిష్యత్ కోసం ఒక్కరోజు సమయం కేటాయించాలన్నారు. పిల్లల ప్రగతి నివేదికలను మీకు తెలియడంతో పాటు ఆటలు, సాంస్కృతిక, ఇతరత్రా రంగాల్లో కనబరిచిన ప్రతిభ గురించి తెలుసుకుంటారన్నారు. ఆరోగ్యపరంగా పరీక్షలు చేయించి వారి వివరాలు పొందుపరుస్తారన్నారు. అదే సమయంలో తల్లులకు రంగోలి, తండ్రులకు టగ్ ఆఫ్ వార్, పిల్లలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు కూడా అందజేస్తారన్నారు. విద్యాసంస్థల ప్రాంగణంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు బృందం ఫోటోలు తీసుకోవడం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నిటికంటే ముఖ్యంగా తల్లిపేరుతో ఒక మొక్కను విద్యార్థికి అందజేస్తారని..అది పెంచే బాధ్యత వారిదేనన్నారు. అందుకే ఇందుకోసం గ్రీన్ పాస్ పోర్ట్ కూడా ఇస్తున్నట్టు ఎమ్మెల్యే సునీత చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన ఈ ముఖ్యమైన కార్యక్రమంలో తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు...

# గోడ కూలి వ్యక్తి మృతి



కావలి,
నెల్లూరు జిల్లా...... కావలిలో విషాదం చోటుచేసుకుంది. కావలి స్థానిక 8వవార్డు చింతంవారి వీధిలో సిమెంట్ రోడ్డు పనులు చేస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైనేజీ పనుల కోసం మట్టితోవ్వతుండగా గోడ కూలింది. అక్కడే పని చేస్తున్న బోగోలు మండలం సాంబశివరావు పురం గ్రామంకు చెందిన తాత వెంకయ్య(55) గోడ కూలి పడటంతో అక్కడికక్కడే కుప్పకూలాడు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పై ప్రసన్న అసత్య ఆరోపణలు చేయడం..!

**ఆకాశం పై ఉమ్ము వేయాలనుకోవడమే..!**

**వేమిరెడ్డి దంపతులను మర్యాదపూర్వకంగా కలిసిన..**

**జలదంకి మండల టిడిపి నేత చేవూరు జనార్దన్ రెడ్డి..**



కావలి,
కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి అసత్య ఆరోపణ చేయడం చూస్తుంటే ఆకాశం పై ఉమ్మి వేయడమే అన్న చందాగా ఉందని ఆకాశం పైకి వేస్తే అది మరలా తన మీద పడుతుందనేది మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి గ్రహించాలని జలదంకి మండలం టిడిపి నాయకులు చేవూరు జనార్దన్ రెడ్డి తెలిపారు.జనార్దన్ రెడ్డి బుధవారం నెల్లూరు మాగుంట లేఔట్ లో ఉన్న వేమిరెడ్డి నివాసానికి వెళ్లి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు.. ఈ సందర్భంగా జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేసేముందు మహిళ అని కూడా చూడకుండా సంస్కారరహితంగా మాట్లాడడం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ నేతలకు మహిళలపై అభిమానం లేదా గౌరవం ఎప్పటికీ లేదని విమర్శించారు. వైసీపీ అధినేత బాటలోనే ఆ పార్టీకి చెందిన మిగిలిన నాయకులు నడుస్తున్నారని పేర్కొన్నారు. మహిళల పట్ల వైసీపీ నేతలు ఏ విధమైన దృష్టితో ఉన్నారో ప్రజలకు మరోసారి బట్టబయలైందని జనార్దన్ రెడ్డి తెలిపారు..

# మండలంలో సుపరిపాలనలో తొలి అడుగు



గుడ్లూరు, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు. కందుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశానుసారం మండల కేంద్రమైన గుడ్లూరులోని ఎస్సీ కాలనీ, మిట్టపాలెం, గుడ్లూరు మండలంలోని గుండ్లపాలెం, నాయుడుపాలెం గ్రామపంచాయతీలలో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. గుడ్లూరులో జరిగిన కార్యక్రమంలో మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు జొన్నలగడ్డ రమణమ్మ,టిడిపి నాయకులు ఉన్నం వెంకటేశ్వర్లు, దామా వెంకటేశ్వర్లు, రావూరి



వేణుగోపాల్, జాజులు శ్రీనివాసులు ,మలిశెట్టి కోటేశ్వరరావు, జానకి రామయ్య పాల్గొన్నారు. నాయుడుపాలెం, గుండ్లపాలెం గ్రామాలలో జరిగిన కార్యక్రమం నందు గుడ్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, గ్రామపార్టీ అధ్యక్షులు, జొన్నలగడ్డ రమేష్ బాబు క్లస్టర్ ఇంచార్జిలు, ఉమ్మినేని సుబ్బారావు, చిత్తారి మల్లికార్జున, గ్రామ నాయకులు బబ్బూరి నాగేశ్వరరావు, చౌటూరి చెంచయ్య, రమేష్, పిగిలి వెంకట నరసింహం, పద్మ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మేకల మాల్యాద్రి, వీరం రాజు, మల్లికార్జున, నాయుడుపాలెం,గుండ్లపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం.

కందుకూరు, :
కోవూరు నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ, ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజా ప్రతినిధులపై, ముఖ్యంగా మహిళా ప్రజా ప్రతినిధులపై ఈ విధమైన వ్యక్తిగత దూషణలు, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమైన చర్య. ఇది రాజకీయ విలువలకు పూర్తి విరుద్ధం.రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, చర్చలు ప్రజా సమస్యలు, అభివృద్ధిపైనే జరగాలి తప్ప, వ్యక్తుల వ్యక్తిగత జీవితాలపై నీచమైన వ్యాఖ్యలు చేయడం సమాజానికి ఏ మాత్రం శ్రేయస్కరం కాదు.ఈ వ్యాఖ్యలు కేవలం శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారిని మాత్రమే కాకుండా, సమస్త మహిళా లోకాన్ని అవమానపరిచే విధంగా ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో ఇటువంటి అనుచిత వ్యాఖ్యలకు చోటు లేదు. బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్నవారు మరింత సంయమనం పాటించాలని, ప్రజా జీవితంలో గౌరవ మర్యాదలను కాపాడాలని మేము డిమాండ్ చేస్తున్నాము. ఈ ఘటనపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కందుకూరు నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ కోరారు.

# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

**-డి.ఎస్.పి భవ్య కిషోర్**

కడియం, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని దక్షిణ మండల డిఎస్పి భవ్య కిషోర్ అన్నారు. కడియం మండలం దుళ్ల పంచాయతీ వద్ద ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కడియం సీఐ ఏ వెంకటేశ్వరరావు



అధ్యక్షతన పోలీస్ అవగాహన సదస్సులో డిఎస్పి భవ్య కిషోర్ మాట్లాడుతూ ప్రజలకు సైబర్ నేరాలు, గంజాయి ఇతర మాదకద్రవ్యాలు వల్ల కలిగే నష్టాలు, నూతన చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియా మోసాలు పెరిగిపోతున్నాయని ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. మోసపూరిత వెబ్సైట్లు, ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే గ్రామస్తుల సందేహాలను నివృత్తి చేసారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన సామాజిక జీవనానికి ఆటంకం కలిగించినా 112 కు ఫోన్ చేయాలని, తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడియం ఎస్సై బి నాగ దుర్గాప్రసాద్, కూటమి నాయకులు ముమ్మిడి దేవీ నాగేస్వరరావు, చిత్తూరి అమ్మిరాజు, ప్రత్తి సూర్య ప్రకాష్, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, చింతా శ్రీనివాస్, మహిళా పోలీస్ ప్రశాంతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# మహిళల గౌరవానికి విఘాతం కలిగిస్తే మౌనంగా సహించేది లేదు:మౌనిక

కందుకూరు
కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన అసభ్య, అనాగరిక వ్యాఖ్యలను మహిళా విభాగం తీవ్రంగా ఖండిస్తుంది. ప్రజాసమస్యలపై చర్చించాల్సిన బాధ్యత ఉన్న నాయకులు, మహిళా నేతలపై వ్యక్తిగత దాడులు చేయడం సమాజానికి తగదు. సంస్కారం అనిపించుకోదు.

ఇది ఒక్కసారిగా జరిగిన సంఘటన కాదు. గత కొంతకాలంగా వైఎస్సార్సీపీ నేతలు మహిళా ప్రజాప్రతినిధులపై, మహిళా నాయకులపై విమర్శల పేరుతో అసభ్య, అవమానకర వ్యాఖ్యలు చేస్తుండడం అలవాటుగా మారింది.

ప్రజాసేవ చేయడమే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చిన మహిళలను వ్యక్తిగతంగా కించపరుస్తున్నారు. ప్రశాంతి రెడ్డి తన నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తూ ప్రజల మనసులు గెలుచుకున్నారు. ఇలాంటి మంచి పనులనుంచి దృష్టిని మళ్లించేందుకు దుష్ప్రచారానికి, అసభ్య వ్యాఖ్యలకు పాల్పడడం బాధాకరం.రాజకీయాల్లో నైతికత, సమాజ హితం, ప్రజాసేవలే ధ్యేయంగా ఉండాలి. మహిళలు రాజకీయాల్లోకి వస్తే ఇలాంటి అనాగరిక దాడులు చేయడం, అసభ్యకరంగా మాట్లాడడం ఎంతమాత్రం సహించరానిది. ఇది మహిళల రాజకీయ ప్రవేశాన్ని అడ్డుకునే చర్యగా మారుతోంది.

ఈ రోజుల్లో మహిళలు ప్రతి రంగంలోకి ప్రవేశిస్తున్నారురాజకీయాల నుంచి ప్రొఫెషనల్ జీవితాల వరకూ, ఇళ్ల నుంచి బోర్డు రూమ్స్ వరకు.
తన ఇంటిని, తన ఉద్యోగాన్ని సమానంగా నిర్వహిస్తూ,



ఆమె తీర్పులని, అంచనాలని ఎదుర్కొంటూ, గౌరవంగా, బాధ్యతగా ముందుకు సాగుతోంది.
అలాంటి సమయంలో, ఒక మాజీ ఎమ్మెల్యే బహిరంగంగా అసభ్య, నీచమైన మాటలు మాట్లాడుతుంటే%ా% చుట్టూ ఉన్నవాళ్లు చప్పట్లు కొడుతూ, నవ్వుతూ, ప్రశంసిస్తూ ఉన్నారు.ఈ వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకుని, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. ఇకపై మహిళలపై ఇలాంటి వ్యాఖ్యలు చేసిన నేతలపై చర్యలు తీసుకోవాలని ఒక సామాన్య మహిళగా డిమాండ్ చేస్తున్నాను. మహిళల గౌరవం, రాజకీయ నైతికతను పరిరక్షించేందుకు కీలక అంశం “ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు”అనే గొప్ప సంస్కృతి నుండి ఈరోజు కనీసం జగన్ మోహన్ రెడ్డి మరియు అతని నాయకులు సొంత చెల్లి ,తల్లి ఇంకా సమాజంలోని మహిళల్ని అశ్లీలంగా దూషించడం సరైనది కాదు.
ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు, దుష్ప్రచారాలు ఇక భరించం. మహిళల్ని అణచిపెట్టే ప్రయత్నాలు ఇక కుదరవు. మహిళలపై దూషణలకు పాల్పడిన ప్రతి నాయకుడిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందే.
ఇధి మహిళల గౌరవాన్ని కాపాడటం మాత్రమే కాదు ు ఇలాంటి అనాగరికపు ముఖాలకు రాజకీయాల్లో స్థానం ఉండదని తేల్చాల్సిందేనని
కందుకూరు తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ ప్రెసిడెంట్ పువ్వాడి మౌనిక డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పాలి

**- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం**

కందుకూరు,
కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై కోవూరు మాజీ శాసనసభ్యులు నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను కందుకూరు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ దివి శివరాం తీవ్రంగా ఖండించారు. మహిళలను వ్యక్తిగతంగా దూషించడం , మానసికంగా ఆవేదనకు గురి చేయడం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు వెన్నతో పెట్టిన విద్యగా ఉందన్నారు. మహిళల పట్ల అసభ్యకరమైన పదజాలం ఉపయోగించిన నాయకులపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మనుగడ సాధించడం ప్రశ్నార్థకమే అవుతుందన్నారు. రాజకీయ నాయకులు సామాన్య ప్రజలకు మార్గదర్శకంగా ఉండాలే తప్ప అసహ్యించుకునే విధంగా ఉండకూడదన్నారు. నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వెంటనే ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో ప్రజలు తగిన రీతిలో సమాధానం చెబుతారని దివి శివరాం హెచ్చరించారు.